

పల్నాడురోడ్డులో పూడిపోయిన వరద నీటి కాలువ



నిర్మాణంలో ఉన్న మోడల్ స్కూల్‌లోని బాలికల హాస్టల్

నాలుగేళ్లైనా.. అసంపూర్తిగానే..

సా..గుతున్న వసతి గృహ నిర్మాణం

రెంటచింతల, జూలై 13 (ఆంధ్రజ్యోతి): జెట్టిపాలెంలోని మోడల్ స్కూల్ విద్యార్థినులకు వసతి లేక ఇబ్బంది పడుతున్నారు. నాలుగేళ్ల నుంచి వసతి గృహ నిర్మాణ పనులు సాగుతున్నాయి. భవన నిర్మాణానికి సమగ్ర శిక్ష ద్వారా రూ.1.90 కోట్లు మంజూరయ్యాయి. అయినా బాలికల హాస్టల్ భవన నిర్మాణం ఎప్పటికి పూర్తి అవుతుందో అంతు పట్టడం లేదు. భవన నిర్మాణం పూర్తి అయితే వంద మంది విద్యార్థినులకు వసతి లభిస్తోంది. అప్పుడు మోడల్ స్కూల్‌లో అడ్మిషన్లు కూడా పెరిగే అవకాశం ఉంటుంది. అయినా అధికారులు ఈ దిశగా ఆలోచన చేయ కపోవడంతో నిర్మాణ పనుల్లో జాప్యం జరుగుతోంది. ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి హాస్టల్ నిర్మాణం పూర్తయ్యే విషయంలో ప్రత్యేక చొరవ తీసుకోవాలని విద్యార్థినుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

నేటి నుంచి కార్మెల్ మాత మహోత్సవాలు

- మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహణ
- అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం: ఫాతిమా మర్రెడ్డి

నేడు జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడి రాక

6

రుణ పరిమితి పెంపు



సాగు వ్యయం పెరిగిపోతోంది. కూలి నుంచి విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల వరకు ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయి. వ్యవసాయ రుణాలు ఖర్చులకు అనుగుణంగా లేవు. అధిక వడ్డీలకు అప్పులు చేయాల్సి వస్తోంది. ఈ పరిస్థితుల్లో రుణ పరిమితి పెంచాలని రైతులు అభ్యర్థిస్తున్నారు. వారి వినతులపై స్పందించిన ప్రభుత్వం రుణ పరిమితి ని పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ఖరీఫ్, రబీ రెండు సీజన్లకు పంటల వారీగా రుణాలను నిర్ణయిస్తూ బ్యాంకర్లకు ప్రభుత్వం దిశా నిర్దేశం చేసింది. తమ గోడు పాలకులు పట్టించుకుని రుణాల పెంపుదలతో అప్పుల తిప్పలు తప్పాయని అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

- ఖరీఫ్, రబీ సీజన్లకు వర్తింపు
- రైతుల అభ్యర్థనకు ప్రభుత్వం స్పందన
- పంటల వారీగా రుణాలపై బ్యాంకర్ల ఆదేశాలు
- అప్పుల బాధలు తప్పాయని అన్నదాతల ఆనందం

(చిలకలూరిపేట, ఆంధ్రజ్యోతి)


ఖరీఫ్ సమీపించిన తరుణంలో గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల పరిధిలో బ్యాంకులు వార్షిక పద్దును ప్రకటించాయి. అయితే రుణ పరిమితి పెంచితే తమకు ఉపయోగకరంగా ఉంటుందని రైతులు అభ్యర్థించగా ప్రభుత్వం వారి గోడు ఆలకించి ఈ ఆర్థిక సంవత్సరంలో సేద్యానికి అందించే రుణాల విషయంలో పరిమితి పెంచింది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ పెంపు నిర్ణయం ఖరీఫ్, రబీ రెండు సీజన్లలో వర్తింప చేయాలని ఆదేశించింది. ఈ ఆదేశాలను బ్యాంకులతో పాటు సహకార సంఘాలు కూడా పాటించాలని ప్రభుత్వం సూచించింది. వరికి సంబంధించి ఎకరా సాగుకు రుణ పరిమితి 46,000 ఉండగా దానిని ఖరీఫ్‌లో 52,000, రబీలో 55,000 వరకు పెంచింది. దీంతో పెట్టుబడి ఖర్చుల్లో సగటున రూ.7000 వరకు రుణం పెరగనున్నది. బాపట్ల, గుంటూరు, పల్నాడు జిల్లాల పరిధిలో నాలుగు లక్షల మంది రైతులకు లబ్ధి చేకూరనుంది. వర్ష ఆధారిత పొలాల్లో పత్తి విషయంలో గత ఆర్థిక సంవత్సరం రూ.46,000లు ఉండగా, దానిని రూ.51,000కు పెంచుతూ ప్రభుత్వ సూచన మేరకు బ్యాంకులు నిర్ణయం తీసుకున్నాయి. మిర్చి సాగుకు రుణ పరిమితి పెంపు నిర్ణయంతో దాదాపు లక్షన్నర మంది రైతులకు మూడు జిల్లాల పరిధిలో మేలు జరగనున్నది. ఉద్యాన పంటల సాగుకు కూడా రుణ పరిమితి పెంచారు.

పంట(ఎకరా)	గతం	ప్రస్తుతం
వరి	46,000	52,000
పత్తి	48,000	55,000
పత్తి(వర్షాధారం)	46,000	51,000
మిర్చి	1,50,000	1,75,000
పచ్చిమిర్చి	90,000	1,10,000
అరటి	99,000	1,10,000

మొక్కజొన్న, కంది, శనగ, మినుము ఇలా దాదాపు ప్రతీ పంటకు రుణ పరిమితి పెంపు నిర్ణయంపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కొర్రీలు వద్దు.. ఉదారంగా వ్యవహరించాలి

వార్షిక పద్దులో వ్యవసాయానికి కేటాయించిన రుణాలలో ప్రతి పైసా రైతులకు చేరాలని బ్యాంకర్లకు ప్రభుత్వం ఇప్పటికే ఆదేశాలు జారీ చేసింది. వ్యవసాయ రుణాల విషయంలో రకరకాల నిబంధనలతో కొర్రీలు వేసే కార్యక్రమాలకు స్వస్తి పలకాలని, సాధ్యమైనంత వరకు ఉదారంగా వ్యవహరించి రైతుల ప్రయోజనాలు కాపాడాలని సూచించింది. రుణాల పెంపు లేకపోగా సర్దుబాటుతోనే గతంలో ముగించేవా రని, ప్రస్తుతం ఆ పరిస్థితి ఉండడానికి వీల్లేదని ప్రభుత్వం బ్యాంకులకు సూచించింది.



పూడిక తీస్తే.. ఇదేంది?

- రెండు విడతల్లో రూ.40 లక్షలు ఖర్చు
- ప్రధాన కాల్వలో ఎక్కడ పూడిక అక్కడే

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

పూడిక, జమ్ము, చెట్లు, వ్యర్థాలతో నరసరావుపేటలోని పల్నాడు రోడ్డులోని ప్రధాన వరద నీటి కాల్వ నిండిపోయింది. ఏళ్లుగా పూడిక తొలగించలేదు.. అందుకే కాల్వ ఇలా ఉందని చూసిన వారు ఎవరైనా అనుకుంటారు. కానీ మున్సిపల్ అధికారులు మాత్రం ఈ కాల్వలో రూ.40 లక్షలు వెచ్చించి పూడిక తీశామని చెప్తున్నారు. ఆ స్థాయిలో నిధులు ఖర్చు చేస్తే వరద నీటి కాల్వ ఇలా ఉంటుందా అన్న ప్రశ్నలు పట్టణ ప్రజల నుంచి వస్తున్నాయి. అంత మొత్తం కాకపోయినా అందులో పదో వంతు ఖర్చు చేసినా కొంతైనా కాల్వ దుస్థితి మారి ఉండేదంటున్నారు. పూడికతీత నిధులు పక్కదారి పట్టాయన్న విమర్శలు వస్తున్నాయి. రెండు విడతల్లో రూ.లక్షలు వెచ్చించినా కాల్వలో ఎక్కడ పూడిక అక్కడే ఉందంటే అధికారులు ఏ రీతిలో పనులు చేశారో తెలుసుకోవచ్చు. కాల్వ ప్రారంభంలో.. చివరలో పూడిక తీసి అధికారులు చేతులు దులుపుకున్నారని తెలుస్తోంది. కాల్వ మధ్య ప్రాంతం మొత్తం వ్యర్థాలు, జమ్ము, చెట్లతో పూడిపోయింది. ఈ పరిస్థితుల్లో ఓ మోస్తరు వర్షం కురిసినా నీరు పోయే మార్గం లేక పరిసర ప్రాంతాలను ముంచెత్తే అవకాశం లేకపోలేదు.



ప్లాస్టిక్ వ్యర్థాలతో వరద నీటి కాలువ



నరసరావుపేట మునిసిపల్ బాలికల ఉన్నత పాఠశాలలో నిలిచిపోయిన అదనపు తరగతి నిర్మాణం

నాడు చేశారని నేడు వదిలేస్తే ఎలా?

అర్ధాంతంగా గత ప్రభుత్వం మనబడి నాడు-నేడు పనులు

- నిధుల కొరతతో అర్ధంతరంగా నిలిచిన భవన నిర్మాణాలు
- తరగతి గదులు, మౌలిక వసతులు లేక ఇక్కట్లు
- ఏడాదిగా ఒక్క పనిలోనూ కనిపించని పురోగతి..
- పనులపై స్పష్టమైన వైఖరి ప్రకటించని కూటమి ప్రభుత్వం

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

మనబడి నాడు-నేడు పథకం కింద గత ప్రభుత్వం చేపట్టిన పాఠశాలల అభివృద్ధి పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయి. ఏడాదిగా ఏ ఒక్క స్కూల్లో కూడా పనులు ముందుకు సాగలేదు. వివిధ దశల్లో నిలిచిపోయిన భవన నిర్మాణాలను పూర్తి చేసే విషయంలో ప్రస్తుత ప్రభుత్వ నిర్ణయం ఏమిటో నేటికీ ప్రకటించలేదు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల ఆత్మీయ సమావేశాల్లో కూడా నిలిచిపోయిన పనులపై చర్చ జరిగింది. ఈ పనులను పూర్తి చేయాలని తల్లిదండ్రులు ప్రభుత్వాన్ని కోరారు. కొన్ని స్కూల్ భవనాలు ఫినిషింగ్ స్టేజ్‌లో, కొన్ని శ్లాబ్ దశలో ఉన్నాయి. కనీసం వీటి విషయంలోనైనా ప్రభుత్వం ఒక నిర్ణయం తీసుకోవాలని.. ఆ ప్రభుత్వం చేపట్టిందని మధ్యలోనే భవన నిర్మాణాలను నిలిపివేయడం సరి కాదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

జిల్లాలో పనులు ఇలా..

పల్నాడు జిల్లాలోని 1,298 ప్రభుత్వ పాఠశాలల్లో నాడు-నేడు అభివృద్ధి పనులు చేపట్టారు. రూ.312 కోట్లు వ్యయం అంచనాతో 8,330 పనులు ప్రారంభించారు. 175 ప్యాకేజీల కింద 759 అదనపు తరగతి గదుల నిర్మాణాలు మొదలు పెట్టగా.. ఇందులో 26 ప్యాకేజీల పనులు మాత్రమే పూర్తయ్యాయి. 547 పాఠశాలల్లో మరుగుదొడ్ల బ్లాక్‌లను నిర్మించడం, ఉన్నవాటికి మరమ్మతులు చేపట్టాలి. 352 స్కూల్స్‌లో ఈ పనులు పూర్తయ్యాయి. అనేక పాఠశాలల్లో మరుగుదొడ్ల వసతి సరిగా లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 91 పాఠశాలలకు ప్రహరీల నిర్మాణం చేపట్టగా.. 29 స్కూల్స్‌లో పనులు పూర్తి చేశారు. విద్యుత్ సరఫరా కోసం 553 పనులు చేపట్టగా 458 పనులు పూర్తయ్యాయి. మరమ్మతుల పనులు 913 చేపట్టగా 284 పనులు పూర్తి చేశారు.

నిలిచిన పనులతో ఇక్కట్లు

ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు నాడు- నేడు పథకం రెండో విడతలో చేపట్టిన పనులు ఎక్కడివి అక్కడే నిలిచిపోయాయి. నిధులు కొరతతో పనులు అర్ధంతరంగా నిలిచిపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నిధులు మంజూరు చేసినట్లు నాడు వైసీపీ ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటించి.. విడుదల చేయకపోవడం విద్యార్థులకు శాపంగా మారింది. నిర్మాణంలో భాగంగా.. స్కూల్‌లో ఉన్న తరగతి గదులను కూల్చివేశారు. నూతన గదులు నిర్మాణం నిలిచిపోవడంతో విద్యార్థులకు తరగతి గదుల సమస్య నెలకొంది. కొన్ని చోట్ల తరగతి గదులు నిర్మాణ సామగ్రితో నిండిపోగా.. విద్యార్థులకు పాఠాలు బోధించేందుకు ఇబ్బందులు నెలకొన్నాయి. మరుగుదొడ్ల నిర్మాణం, విద్యుత్, తాగునీటి వసతి, ఫర్నీచర్, మేజర్, మైనర్ మరమ్మతులు, తరగతి గదులు, ప్రహరీల నిర్మాణం, గ్రీన్‌చాక్ బోర్డులు, ఇంగ్లీషు ల్యాబ్‌లు, రంగులు వేసే పనులు చేపట్టారు. ఆయా పనులు పూర్తి చేసి స్కూల్స్‌లో వసతులు మెరుగుపర్చాలని తల్లిదండ్రులు విజ్ఞప్తి చేస్తున్నారు. నాడు-నేడు పనులపై కూటమి ప్రభుత్వం స్పష్టమైన వైఖరిని వెల్లడించాల్సి ఉంది.



మునిసిపల్ బాలుర స్కూల్‌లో నిలిచిన తరగతి గదుల నిర్మాణం

వంకాయలపాడులో.. అనకొండలు

యడ్లపాడు, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మారింది. మైనింగ్ మాఫియా మాత్రం మారలేదు. అనుమతులు లేకుండా.. భారీ యంత్రాలతో యథేచ్ఛగా తవ్వకాలు చేస్తోంది. యడ్లపాడు మండలం వంకాయలపాడు రెవెన్యూ పరిధిలో అనకొండల్లా మారిన మైనింగ్ మాఫియా కొండలను కరిగించేస్తోంది. విశ్వనాథునికండ్రిక, ఉప్పరపాలెం, కొండవీడు, మైదవోలు గ్రామాల పరిధిలోని 37 కొండ క్వారీలకు గతంలో అధికారులు అనుమతులు ఇచ్చారు. అయితే వాటిలో మైదవోలు, కొండవీడు పరిధిలోని నాలుగు క్వారీల్లో మైనింగ్ కార్యకలాపాలు నిలిచిపోయాయి. కాగా మిగిలిన 33 క్వారీల్లో ఉప్పరపాలెంలో 23, విశ్వనాథునికండ్రిక పరిధిలో 10 క్వారీలు ఉండగా రెండు దగ్గర్ల నాలుగు చొప్పున క్వారీలకు మాత్రమే అనుమతులు ఉన్నాయి. మిగిలిన వాటికి అనుమతులు లేకున్నా యథేచ్ఛగా మైనింగ్ చేస్తున్నారు. అనుమతులు లేని వాటిలోని పది క్వారీలు వైసీపీ వారివని సమాచారం. గత వైసీపీ ప్రభుత్వంలో టీడీపీ వారిని దరిదాపులకు కూడా రాకుండా అడ్డుకున్నారు. కూటమి ప్రభుత్వంలోనూ వారి హవానే కొనసాగుతోంది. టీడీపీకి చెందిన మండల నాయకుడు ఒకరు ముడుపులు పుచ్చుకుని వైసీపీ వారికి ఒత్తాసు పలుకుతున్నట్లు సొంతపార్టీకి చెందిన వారే ఆరోపిస్తున్నారు. రోజుకు సగటున వెయ్యి యూనిట్ల కంకర, డస్టును 100 నుంచి 120 టిప్పర్లలో తరలించి విక్రయిస్తున్నారు. దీనితో ప్రభుత్వానికి రాయల్టీ రూపంలో రావాల్సిన ఆదాయానికి గండి పడుతుంది. క్వారీయింగ్‌కు అనుమతులను పట్టించుకోకుండా ఏఎంఆర్ సంస్థ బిల్లులను మంజూరు చేస్తున్నట్లు ఆరోపణలు న్నాయి.

- అనుమతులు లేకుండా మెటల్ క్వారీయింగ్
- క్వారీల్లో గతంలోనూ.. ఇప్పుడూ వైసీపీ వారిదే హవా
- కలెక్టర్‌కు ఉప్పరపాలెంవాసుల ఫిర్యాదు.. ఆర్డీవో విచారణ

రక్షణ చర్యలు లేకుండా పేలుళ్లు..

నిర్దిష్ట సమయాలు, రక్షణ చర్యలు పాటించకుండా, హెచ్చరిక బోర్డులు లేకుండా పేలుళ్లు జరుపుతున్నారు. ఎత్తైన కొండలతోపాటు భూగర్భ లోతుల్లో మైనింగ్ చేస్తున్నారు. పేలుళ్లతోపాటు జంబో క్రషర్ల కారణంగా వెలువడుతున్న దుమ్ము, ధూళి సమీప గ్రామా లతో పాటు పరిసర నీటి వనరులపై విస్తరించడంతో వ్యాధులకు గురవుతున్నట్లు ఉప్పరపాలెం గ్రామానికి చెందిన కొందరు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ అరుణ్‌బాబుకు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాలతో ఆర్డీవో మధులత విచారణ చేపట్టి మైనింగ్ కార్యకలాపాలను చూసి ఆశ్చర్యపోయి ఉమ్మడి సర్వేకు ఆదేశించారు. నిబంధనలకు విరుద్ధంగా మైనింగ్ చేసిన వారి పై క్రిమినల్ కేసులు నమోదు చేసి లీజులను రద్దు చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.



సర్వే చేస్తున్న అధికారులు



ఉప్పరపాలెం పరిధిలో అనుమతులు లేకుండా క్వారీయింగ్ చేస్తున్న కొండ

సమ్మెలోకి మున్సిపల్ కార్మికులు



మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

నరసరావుపేట, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ప్రకటించినట్లుగానే మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులు ఆదివారం నుంచి నిరవధిక సమ్మె చేపట్టారు. సీఐటీయూ అనుబంధ సంఘం ఏపీ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నరసరావుపేట, పిడుగురాళ్ల, సత్తెనపల్లి మున్సిపాల్టీలలో సమ్మె ప్రారంభమైంది. నీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణ, ప్రణాళికా విభాగం, కంప్యూటర్ ఆపరేటర్లు, డ్రైవర్లు, పిట్టర్లు, మెకానిక్‌లు సమ్మెలో పాల్గొన్నారు. సమస్యలు పరిష్కరించాలని అనేక మార్లు ప్రభుత్వాన్ని కోరినా స్పందించని కారణంగా నిరవధిక సమ్మె చేపట్టినట్లు కార్మిక సంఘ నేతలు తెలిపారు. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించే వరకు సమ్మె కొనసాగిస్తామని కార్మికులు తెలిపారు. కార్మికుల సమ్మెతో నీటి సరఫరాకు ఇబ్బందికర పరిస్థితులు తలెత్తనున్నాయి. నరసరావుపేట మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆదివారం కార్మికులు ధర్నా చేశారు. కార్యక్రమానికి యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు సిలార్ మసూద్, షేక్ చిన్న, బత్తులశ్రీను,సామ్రాజ్యం, షేక్ ఖాన్ నాయకత్వం వహించారు.

బోనాల ఉత్సవం

రాజుపాలెం, జూలై 13 (ఆంధ్రజ్యోతి): రాజుపాలెం గ్రామం ఆర్ అండ్‌ఆర్ సెంటర్లో బోనాల ఉత్సవం ఆదివారం కన్నుల పండువుగా జరిగింది. పసుపు, కుంకుమ, వేపాకులతో అలంకరించిన బోనాలను నెత్తిమీద పెట్టుకున్న మహిళా భక్తులు పూలు, నిమ్మకాయల దండలు మెడలో వేసుకుని ప్రదర్శనగా ఆలయానికి తరలివచ్చారు. చక్కెర, బెల్లం, పసుపు అన్నం, చింతపులుసు నైవేద్యాలను గ్రామ దేవత శ్రీఅంకమ్మతల్లికి సమర్పించారు. వర్షాకాలంలోకి అడుగుపెట్టే సమయంలో వ్యాధుల బారిన పడకుండా కాపాడాలని, అందరినీ క్షేమంగా చూడాలని అమ్మవారిని భక్తులు వేడుకున్నారు. బోనాల సమర్పణ తర్వాత ఆలయం వద్ద భక్తులు వేపాకులను చేతబూని నృత్యం చేశారు.



అంకమ్మతల్లికి బోనాలు సమర్పించేందుకు బయల్దేరిన భక్తులు

ఆప్షన్-3.. అక్రమాలమయం

- 1829 ఇళ్లకు 830 మాత్రమే పూర్తి
- జగనన్న కాలనీల్లో కాంట్రాక్టర్ల చేతివాటం
- గృహ నిర్మాణాల్లో అవకతవకలు, నాణ్యతలేమి

సత్తెనపల్లి, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ధూళిపాళ్ల, గండ్లూరులోని జగనన్న లేఅవుట్లలో ఆప్షన్-3 కింద చేపట్టిన గృహ నిర్మాణాల్లో భారీగా అక్రమాలు చోటుచేసుకున్నాయి. అధికారులు, కాంట్రాక్టర్లు కలిసి లబ్ధిదారుల సొమ్ములను దోచేసుకున్నారు. ఆప్షన్ - 3 కింద లబ్ధిదారులు బేస్‌మెంట్ లెవల్ వరకు రూ.55 వేలు వరకు బిల్లులు చెల్లించాలి. అయితే అధికారులు రూ.90 వేలు చెల్లించారు. అధిక మొత్తంలో బిల్లులు చేసుకున్న కాంట్రా క్టర్లు నిర్మాణాలను పూర్తి చేయకుండా అసంపూర్తిగా వదిలేశారు. గండ్లూరు-2 పరిధిలో 514 గృహాలకు 160 గృహాలు మాత్రమే పూర్తి చేశారు. ఇంకా 298 గృహాలు బేస్‌మెంట్ లెవల్‌లోనే ఉన్నాయి. ధూళిపాళ్లలో 520 గృహాలకు 139 బేస్‌మెంట్ స్థాయిలోనే ఉన్నాయి. మరో కాంట్రాక్టర్ 78 గృహాలకు పది మాత్రమే పూర్తి చేశాడు. ఇంకో కాంట్రాక్టర్ 59 గృహాలకు 15, మరో కాంట్రాక్టర్ 74 గృహాలకు 36 మాత్రమే పూర్తి చేశారు. మొత్తంగా చూస్తే 1829 గృహ నిర్మాణాలకు 830 మాత్రమే పూర్తయ్యాయి. లబ్ధిదారుల పేరుతో విడుద లైన సిమెంట్, ఇనుము, ఇసుకను కూడా కాంట్రాక్టర్లు దారిమళ్లించిన ట్లు సమాచారం. పునాదులు లోతుగా తీయకుండా నిర్మాణాలు చేపట్టారు. నాణ్యమైన సిమెంట్ కూడా వినియోగించలేదని లబ్ధిదారులు వాపోతున్నారు. ఈ నెల 2న హౌసింగ్ డీఈ రాజు తనిఖీలో ఆయా అక్రమాలు వెలుగు చూశాయి. నగదు తీసు కుని నిర్మాణాలు పూర్తి చేయని కాంట్రాక్టర్లకు నోటీ సులు జారీ చేయాలని, అవసరమైతే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. అయితే ఇంతవరకు స్థానిక అధికారులు ఆ ఆదేశాలను పట్టించుకోలేదు. ఈ పరి స్థితుల్లో జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాల అక్రమాలపై రెవెన్యూ యంత్రాంగం విచారణ ప్రారంభించింది. ఈ విచారణతో లబ్ధిదారుల మాటున వైసీపీ నాయకులు, కాం ట్రాక్టర్లు సాగించిన అక్రమాలు బహిర్గతమయ్యే అవకాశాలు ఉన్నాయి. ఆప్షన్ - 3 గృహ నిర్మాణాలు నత్తనడకన సాగడంపై డీఈ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ కాంట్రాక్టర్లకు గృహ నిర్మాణాలు కేటాయించడమే తప్పన్నారు. వారు ఇష్టా రాజ్యంగా గృహ నిర్మాణాలు చేసిన మాట వాస్తవమేనన్నారు.



ధూళిపాళ్లలో ఆప్షన్ - 3 గృహాల పరిస్థితి



గండ్లూరు లేఅవుట్‌లో బేస్‌మెంట్ లెవల్‌లోనే ఆగిన ఇళ్లు

క్రీడా గాయాలకు..
ఆర్థ్రోస్కోపీతో చక్కటి పరిష్కారం

● ప్రముఖ సర్జన్ శివకుమార్ మామిళ్లపల్లి
● గుంటూరులో ముగిసిన రాష్ట్రస్థాయి వర్క్‌షాప్



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న డాక్టర్ రమణ యశస్వి. చిత్రంలో ప్రముఖ సర్జన్ శివకుమార్

గుంటూరు మెడికల్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): క్రీడాకారులకు అయ్యే తీవ్రమైన భుజం, మోకీలు గాయాలకు సమర్థవంతమైన ఆర్థ్రోస్కోపీ సర్జరీ అందించవచ్చని గుంటూరు ఆర్థ్రోస్కోపీ సదస్సు ఆర్గనైజింగ్ కమిటీ చైర్మన్, ప్రముఖ శస్త్రచికిత్స నిపుణుడు డాక్టర్ శివకుమార్ మామిళ్లపల్లి తెలిపారు. నగరంలోని ఓ హోటల్‌లో ఆదివారం జరిగిన రాష్ట్రస్థాయి ఆర్థ్రోస్కోపీ సదస్సులో ఆయన ప్రసంగించారు. తొలుత ముఖ్య అతిథి గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి జ్యోతి ప్రజ్వలన గావించి, సదస్సును ప్రారంభించారు. రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన బాధితుల్లో లిగమెంట్ టేర్ వంటి గాయాలతో పాటు టెన్నిస్ ఎల్బో వంటి స్పోర్ట్స్ ఇంజ్యూరీస్‌కు ఆర్థ్రోస్కోపీ సర్జరీ ద్వారా చక్కటి పరిష్కారం లభిస్తుందని డాక్టర్ శివకుమార్ తెలిపారు. జాతీయ స్థాయిలో పేరుగాంచిన పలువురు వైద్య నిపుణులు ఈ సదస్సులో పాల్గొని లైవ్ సర్జరీలు నిర్వహించడమే కాకుండా వర్క్ షాప్ కూడా నిర్వహించడం జరుగుతుందన్నారు. ఆర్థ్రోస్కోపీలో నూతన వైద్య చికిత్సలు, టెక్నిక్‌లను యువ వైద్యులకు వివరిస్తారని వెల్లడించారు. సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి మాట్లాడుతూ గతంలో ఇటువంటి ఆర్థ్రోస్కోపీ కాన్ఫరెన్స్‌లు మెట్రోపోలిటన్ నగరాల్లో మాత్రమే జరిగేవన్నారు. ఇప్పుడు గుంటూరులో మొదటిసారిగా నిర్వహించడం అభినందనీయమన్నారు. సదస్సు ఆర్గనైజింగ్ కమిటీ కార్యదర్శి డాక్టర్ గంటా చైతన్య మాట్లాడుతూ దేశంలో పలు ప్రాంతాలకు చెందిన ప్రముఖ ఆర్థ్రోస్కోపీ సర్జన్లు ఈ సదస్సుకు హాజరై యువ వైద్యులకు మెళకువలు నేర్పుతున్నట్లు తెలిపారు. గుంటూరుతోపాటు రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 180 మంది ఆర్థ్రోస్కోపీ/ఆర్థోపెడిక్ సర్జన్లు పాల్గొని, సర్జికల్ స్కిల్స్‌ని పెంచుకున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ ఆర్థ్రోస్కోపీ సీఎంఈ కార్యక్రమానికి రెండు సీఎంఈ క్రెడిట్ అవర్స్ కేటాయించింది.

నేడు జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడి రాక

గుంటూరు, జూలై 13 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రామచంద్రరావు సోమవారం జిల్లాలో పర్యటించనున్నారు. ఆయన మధ్యాహ్నం 3 గంటలకు కలెక్టరేట్‌కు చేరుకొని ఉన్నతాధికారులు, వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహిస్తారు. ఈ సమీక్షకు ఆయా శాఖల అధికారులు సమగ్ర సమాచారంతో హాజరు కావాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆదేశించారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

మాచర్ల రూరల్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం ఆదివారం నాటికి 551.10 అడుగులు ఉంది. ఇది 212.20 టీఎంసీలకు సమానం. ఎస్ఎల్‌బీసీ 1650 క్యూసెక్కులు, మొత్తం అవుట్‌ఫ్లోగా 1650 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల చేస్తున్నారు. కాగా శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో 63,317 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

బాల శాస్త్రవేత్తలను ఇన్‌స్పైర్ చేద్దాం!

- 2025-26 ఇన్‌స్పైర్ మనక్ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం
- ఆన్‌లైన్ నమోదుతో ప్రాజెక్ట్ నమూనాల ఎంపిక
- సెప్టెంబరు 15 వరకు గడువు
- ఎంపికైన ప్రతి ప్రాజెక్ట్‌కు రూ.10 వేల ప్రోత్సాహం
- జాతీయ స్థాయిలో రాణిస్తే.. మరెన్నో ప్రయోజనాలు
- తరగతి గదిలోనే పరిశోధనలకు పునాది

నరసరావుపేట కల్చరల్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ఆడిటోరియంలోకి వెళ్తాం. అంతా చీకటిగా ఉంటుంది. ఖాళీ సీటు ఎక్కడుందో తెలియదు. ఈ సమస్యకు పరిష్కారంగా మహారాష్ట్రకు చెందిన నీరజ్ పసుపులే అనే విద్యార్థి ఒక ఇండికేటర్‌ను కనుక్కున్నాడు. ఈ ఇండికేటర్‌ను సీటుకు అమర్చడంతో సులభంగా గుర్తించవచ్చు. వీధిలోని చెత్తకుండి నిండి పోయి పక్కన పడిన వ్యర్థాలతో అక్కడి వాతావరణం అపరిశుభ్రంగా మారుతుంది. డయ్యూడామన్‌కు చెందిన చిన్నారులు ప్రేమ్ అంకుష్, శివాని ఈ సమస్యకు పరిష్కారంగా ఒక పరికరాన్ని కనుగొన్నారు. కుండీలో చెత్త నిండగానే పరికరం సాయంతో చెత్త సేకరించే వాహనానికి తెలుస్తుంది. ఇలా నిత్య జీవితంలో ఎన్నో సమస్యలకు సులువైన పరిష్కారాలను చిన్నారుల నుంచి రాబట్టి వారిని భావి శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దే లక్ష్యంతో కేంద్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ ప్రతి సంవత్సరం ఇన్‌స్పైర్ మనక్ అవార్డుల పేరుతో విద్యార్థులను పరిశోధనలపై మళ్లించేలా కార్యక్రమాన్ని చేపడుతోంది. ఇందులో భాగంగా ఈ విద్యా సంవత్సరానికి దరఖాస్తులను కోరుతోంది. దేశవ్యాప్తంగా 6 నుంచి 12 తరగతులు చదువుతున్న విద్యార్థుల నుంచి లక్ష ప్రాజెక్టులను ఎంపిక చేసి ఒక్కోదానికి రూ.10 వేల ప్రోత్సాహమందిస్తోంది. విద్యాశాఖ పరిధిలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు, కేజీబీవీ, ఆదర్శ, గురుకుల పాఠశాలల విద్యార్థులు పాల్గొనవచ్చు.

ప్రాజెక్టు ఎలా ఉండాలంటే..

తక్కువ ఖర్చులో పర్యావరణహితంగా ప్రాజెక్ట్ నమూనా ఉండాలి. ఎక్కువ మందికి ప్రయోజనకారిగా, సులభమైన నిర్వహణ విధానం, మెరుగైన పనితీరు కలిగి ఉండాలి. సృజనాత్మకతతో స్థానిక సమస్యలకు పరిష్కారం చూపాలి. తొలుత పాఠశాల స్థాయిలో ఐడియా కాంపిటీషన్ నిర్వహించాలి. ప్రతి తరగతి నుంచి ఉత్తమ ఆలోచనను ఎంపిక చేసి.. అందుకు తగ్గట్టుగా ప్రాజెక్టును రూపొందించుకోవాలి.

వెబ్‌సైటులో నమోదు ఇలా..

ముందుగా ఇన్‌స్పైర్ మనక్ వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. విద్యార్థి సమాచారంతో పాటు అతని బ్యాంకు అకౌంట్ వివరాలు, ఆధార్ నంబరు నమోదు చేయాలి. ఎంచుకున్న ప్రాజెక్టుపై 300 పదాల్లో సంక్షిప్తంగా వివరాలు అప్‌లోడ్ చేయాలి. ప్రాజెక్ట్ నమూనా ఎంపికైన ప్రతి విద్యార్థికి రూ.10 వేల ప్రోత్సాహకం ఇస్తారు. అక్కడి నుంచి జిల్లా, రాష్ట్రస్థాయి ప్రదర్శనల్లో పాల్గొని.. జాతీయ స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపికైన బాల శాస్త్రవేత్తలు తమ ప్రాజెక్టును మెరుగుపరుచుకునేందుకు శాస్త్ర, సాంకేతిక శాఖ మరో రూ.25వేల నిధులు అందిస్తుంది. జాతీయస్థాయిలో ఎంపికైన ప్రాజెక్టు నమూనా లు రాష్ట్రపతి భవన్‌లో నిర్వహించే ప్రదర్శనలో ఉంచుతారు. అలాగే జపాన్ దేశం సందర్శించే అవకాశం లభిస్తుంది. ఎంపికైన ప్రాజెక్టుకు పేటెంట్ లభిస్తుంది. సెప్టెంబర్ 15వ తేదీతో ఆన్‌లైన్ నమోదు గడు వు ముగుస్తుంది. ఇతర వివరాలకు జిల్లా సైన్స్ అధికారిని సంప్రదించవచ్చు.

విద్యార్థుల సృజనాత్మకతకు వేదిక
ఎల్.చంద్రకళ, డీఈవో, పల్నాడు



ఇన్‌స్పైర్ మనక్ విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకత ప్రదర్శనకు ఒక చక్కని వేదిక. ఈ పోటీల్లో విద్యార్థులందరూ పాల్గొనేలా సైన్సు ఉపాధ్యాయులు ప్రోత్సహించాలి. ప్రాథమిక పాఠశాల నుంచి 3, ఉన్నత పాఠశాలల నుంచి 5 ప్రాజెక్టులు తప్పని సరిగా నమోదు చేయాలి. జిల్లా నుంచి ఎక్కువ సంఖ్యలో నామినేషన్లు నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలి.

ఉపాధ్యాయులు చొరవ తీసుకోవాలి
ఎం.రాజశేఖర్, డీఎస్‌వో, పల్నాడు



విద్యార్థుల్లోని అంతర్గత సామర్థ్యాన్ని, సృజనాత్మకతను వెలికి తీయడానికి ఇదో అద్భుత అవకాశం. ఉపాధ్యాయులు చొరవ తీసుకుని ఎక్కువ మంది విద్యార్థులు పాల్గొనేలా ప్రోత్సహించాలి. బాల శాస్త్రవేత్తలను తీర్చిదిద్దాలి.

నేటి నుంచి కార్మెల్ మాత మహోత్సవాలు

● మూడు రోజులపాటు ఘనంగా నిర్వహణ ● అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం: ఫాతిమా మర్రెడ్డి

ఫిరంగిపురం, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రా రోమ్‌గా పిలవబడుతున్న ఫిరంగిపురంలో సోమవారం నుంచి కార్మెల్ మాత ఉత్సవాలు ఘనంగా ప్రారంభం కానున్నాయి. వరుసగా మూడు రోజుల పాటు మంగళ, బుధవారాల్లో జరగనున్న ప్రతిష్ఠాత్మక ఉత్సవాలకు వందలాది మంది భక్తులు తరలి రానున్నారు. గ్రామంలోని కొండపై 1891లో వేంచేసిన కార్మెల్ మాతను భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో కొలుస్తుంటారు. జీసెస్ తల్లి మరియమ్మకు మరో పేరే కార్మెల్ మాత. క్రీస్తు పూర్వం 857లో ఆహాబు రాజు పాలనలో పాలస్తీన దేశంలో అనావృష్టి వల్ల కరువు సంభవించింది. దీనిపై ఏలియా అనే దీర్ఘదర్శి కార్మెల్ పర్వత గుహలో ప్రార్థించగా.. ఆకాశంలో కారు మేఘాలు కమ్మి కుంభ వృష్టిగా వర్షం పడింది. దీంతో పంటలు సమృద్ధిగా ఫలించి కరవు తొలగింది. కావున కార్మెల్ పర్వతం ప్రశాంతతకు, పవిత్రతకు నిలయంగా మారింది. ఫిరంగిపురంలోని కార్మెల్ మాత కొండ కూడా అంతే ప్రసిద్ధి చెందింది. దీంతో 1001 మెట్లు ఉన్న ఈ ఎత్తయిన కొండను భక్తులు అవలీలగా ఎక్కుతుంటారు. లండన్ మిల్‌హిల్‌కు చెందిన ఫాదర్ థియోడర్ డిక్మన్ 1891లో కార్మెల్ మాత దేవాలయాన్ని కొండ మీద నిర్మింపజేశారు. 1922లో పర్మన్ స్వామి ఆలయాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. 1980లో ఫాదర్ డీసీఎల్ పూదోట ఇన్నయ్య యాత్రికుల కోసం వసతి గృహం, మెట్ల బాట వెంట విద్యుత్ సదుపాయం, ప్రదర్శనశాల, నీటి ట్యాంక్‌లను ఏర్పాటు చేశారు. అలాగే కొండ మెట్ల వెంబడి 14 స్థలాలను ఏర్పాటు చేశారు. 1933లో మరియదళం, సొడాలిటీ సభ ఏర్పాటైంది. భక్తులు తమ మొక్కులను తీర్చుకొని.. వారి గ్రామాలకు చేరేలోగా వర్షాలు పడి విత్తనాలు వేసుకొని వ్యవసాయాన్ని ప్రారంభించే ఆనవాయితీ ఉంది.



ఫిరంగిపురంలో కొండపై కార్మెల్ మాత దేవాలయం

వీటితో పాటు గ్రామంలోని ప్రధాన కూడళ్లలో కార్మెల్ మాత, మరియ మాత, సృష్టికర్త మాత, జీసెస్‌ల మందిరాలు అనేకం వెలిశాయి. వీటి నిర్మాణాల వల్ల గ్రామం ఆధ్యాత్మికతతో విరాజిల్లుతోంది.

పండగకు అన్ని ఏర్పాట్లు చేశాం : ఫాతిమా మర్రెడ్డి, చర్చి ఫాదర్

రాష్ట్రం నలుమూలల నుంచి తరలివచ్చే గురువులు, కన్యా స్త్రీలు, భక్తులకు బస, తాగు నీటి సౌకర్యం కల్పించామని బాల ఏసు చర్చి ఫాదర్ మాలపాటి ఫాతిమా మర్రెడ్డి తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా..పోలీసు శాఖతో సంప్రదించి అదనపు బలగాలను రప్పిస్తున్నట్లు వెల్లడించారు. పండగ కరపత్రాలు, వాల్ పోస్టర్లు అన్ని చర్చిలకు పంపామన్నారు. భక్తులకు రెండు రోజుల పాటు అన్నదానం కూడా చేస్తున్నామని ఆయన తెలిపారు.

గంజాయి విక్రేతల అరెస్టు

తెనాలి రూరల్, జూలై13 (ఆంధ్రజ్యోతి): గంజాయికి బానిసలై.. దానినే వ్యాపారంగా మార్చుకున్న ముఠాను రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఆదివారం రూరల్ కార్యాలయంలో సీఐ ఉమేష్, ఎస్ఐ ఆనంద్ విలేకరుల సమావేశం నిర్వహించి, వివరాలు వెల్లడించారు. తెనాలి మండలం కఠెవరం గ్రామానికి చెందిన ముక్కాల ప్రకాశరావు, పెదరావూరు గ్రామానికి చెందిన దర్శి ప్రదీప్ కుమార్, చినపరిమికి చెందిన నలిగల శివనాగరాజు, తెనాలికి చెందిన మెరుగుమాల ప్రశాంత్‌కిరణ్ నలుగురూ వ్యసనాలకు బానిసలయ్యారని తెలిపారు. ఈ క్రమంలోనే విజయవాడకు చెందిన ఇమ్మానుయేలు అనే వ్యక్తిని పరిచయం చేసుకుని.. అతడి నుంచి గంజాయి కొనుగోలు చేస్తున్నట్లు వెల్లడించారు. అందులో కొంత సేవిస్తూ మిగిలిన దానిని చిన్న ప్యాకెట్లలో తెనాలి, పరిసర గ్రామాలు, విజయవాడ, గుంటూరు వంటి ప్రాంతాల్లో విక్రయిస్తున్నట్లు తెలిపారు. జగ్గడిగుంటపాలెం సమీపంలోని టిడ్కో గృహ సముదాయాల వద్ద గంజాయి విక్రయిస్తున్నారని పోలీసులకు సమాచారం అందడంతో దాడులు జరిపామన్నారు. నలుగురినీ అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ. 10 వేలు విలువ జేసే కేజీ 300 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. నిందితులపై కేసు నమోదు చేశామని, వీరిలో మెరుగుమాల ప్రశాంత్ కిరణ్‌పై త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో రౌడీషీటు ఉందని ముక్కాల ప్రకాశరావుపై విశాఖ, రాజ మహేంద్రవరం జిల్లాల్లో గంజాయి కేసులు ఉన్నాయని వివరించారు.



పట్టుబడిన గంజాయి, నిందితులను చూపుతున్న సీఐ ఉమేష్, ఎస్ఐ ఆనంద్

9 మంది జూదరుల అరెస్టు

కారుమంచి(శావల్యాపురం)జూలై13(ఆంధ్రజ్యోతి): మండలంలోని కారుమంచి గ్రామ సమీపం సపోటా తోటలో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై శావల్యాపురం ఎస్ఐ లేళ్ళ లోకేశ్వరరావు తన సిబ్బందితో కలసి ఆదివారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. తొమ్మిది మంది జూదరులను అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.1,54,800 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ వెల్లడించారు. సోమవారం వినుకొండ కోర్టులో నిందితులను హాజరు పరచనున్నట్లు తెలిపారు. కారుమంచి సమీపంలోని పొలాల్లో వివిధ జిల్లాలకు చెందిన వ్యక్తులు పేకాట శిబిరాలు నిర్వహిస్తున్నారని, భారీ మొత్తంలో నగదు చేతులు మారుతున్నట్లు ప్రజల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టి, అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.

తొలి అడుగులో ఎమ్మెల్యే బూర్లకు నిరసన సెగ

● అన్నవరంలో కార్యకర్తల బాహాబాహి ● పాలపర్రులో వాటర్ ప్లాంట్‌పై రభస

పెదనందిపాడు, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులుకు పెదనందిపాడు మండలంలో తెలుగు తమ్ముళ్ల నుంచి నిరసన సెగ తగిలింది. పార్టీలో సముచిత స్థానం కల్పించడం లేదంటూ ఓ వర్గం, పార్టీలో కొత్తగా వచ్చిన వారికి ప్రాధాన్యం ఇస్తున్నారని మరో వర్గం ఎమ్మెల్యే ఎదుట బాహాబాహీకి దిగారు. డ్వాక్రా మహిళలు సైతం ఎమ్మెల్యేపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అవినీతికి పాల్పడుతున్న వీవోఏను తొలగించాలని ఎమ్మెల్యే కార్యాలయం, పోలీస్ స్టేషన్ చుట్టూ తిరుగుతున్నా అతీగతి లేదంటూ మండిపడ్డారు. ఈ విధంగా ఎమ్మెల్యే బూర్ల అడుగు పెట్టిన ప్రతి గ్రామంలోనూ ఆయనకు నిరసనలతో పాటు సమస్యలు ఆయనను చుట్టుముట్టాయి. కార్యకర్తలకు న్యాయం చేస్తానని, సమస్యలు చూసి భయపడే వ్యక్తిని కాదని.. సమస్యలను ఈ విధంగా రోడ్డెక్కించడం మంచిది కాదని, కూర్చుని పరిష్కరించుకోవచ్చంటూ ఎమ్మెల్యే రామాంజనేయులు కార్యకర్తలకు సర్ది చెప్పుకుంటూ వచ్చారు. అన్నవరంలో అడుగు పెట్టిన ఎమ్మెల్యేపై.. ఎప్పటి నుంచో పార్టీలో పనిచేస్తున్న తమకు న్యాయం చేయడం లేదని, కొత్తగా వచ్చిన వారిని అందలం ఎక్కిస్తున్నారని, కార్యాలయానికి వచ్చినా విలువ ఉండటం లేదంటూ కొందరు ఆగ్రహం వ్యక్తం చేశారు. కొత్తగా ఏర్పాటు చేస్తున్న పలు కమిటీల్లో కూడా సీనియర్లకు ప్రాధాన్యం ఇవ్వడం లేదంటూ వాపోయారు. అలాగే పాలపర్రులో అవినీతికి పాల్పడుతున్న వీవోఏను తొలగించాలని డ్వాక్రా మహిళలు ఎమ్మెల్యేను చుట్టుముట్టారు. సీపీఎం, పలు పార్టీల నుంచి వచ్చిన వారికి ప్రాధాన్యం ఇస్తున్నారని మండిపడ్డారు. గ్రామంలో వైసీపీ నాయకుడు నిర్వహిస్తున్న వాటర్ ప్లాంట్ వద్దకు వెళ్లి.. దానిని టీడీపీ వారికి అప్పగించే యత్నం చేశారు. అయితే నిర్వాహ కుడు పంచాయతీ అనుమతితో ఆరేళ్లుగా ప్లాంటు నిర్వహిస్తున్నానని, అవసరమైతే పంచాయతీకి అప్పగిస్తానని తెగేసి చెప్పడంతో.. ఎమ్మెల్యే ఆగ్రహించారు. నిర్వాహకుడిపై కేసు నమోదు చేసి, వెంటనే వాటర్ ప్లాంట్‌ను స్వాధీనపరుచుకోవాలని అధికారులను ఆదేశించారు.



పథకాలు అందడం లేదంటూ ఎమ్మెల్యేకు వివరిస్తున్న గ్రామస్తులు

విజయేశ్వరి.. బగళాముఖి



పిట్టలవానిపాలెం, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : చందోలు బగళాముఖి అమ్మవారి దేవస్థానంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కు బడులు తీర్చుకున్నారు. సకల విజయాలు ప్రసాదించే విజయేశ్వరి రూపంలో అమ్మవారు దర్శనమిచ్చారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేసినట్లు ఈఓ జి.నరసింహమూర్తి తెలిపారు.

తెలుగు వారి హృదయాల్లో చిరస్థాయిగా ఎన్టీఆర్

● ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ



ఎన్టీఆర్ విగ్రహావిష్కరణలో పాల్గొన్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్

నకరికల్లు, జూలై 13 (ఆంధ్రజ్యోతి): తెలుగు ప్రజల హృదయాల్లో ఎన్టీ రామారావు చిరస్థాయిగా నిలిచి పోతారని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. ఆదివారం రాత్రి నకరికల్లు మండలం చల్లగుండ్ల గ్రామంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్‌తో కలసి టీడీపీ వ్యవస్థాపకులు ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. అనంతరం సభలో కన్నా మాట్లాడుతూ టీడీపీని స్థాపించి తొమ్మిది నెలల్లో అధికారంలోకి తెచ్చి రాజకీయాల్లో ఎన్టీఆర్ చరిత్ర సృష్టించారన్నారు. సినీ రంగంలోనే కాక రాజకీయ రంగంలోనూ ఎన్టీఆర్ యుగ పురుషుడిగా నిలిచారన్నారు. ఎన్టీఆర్ తర్వాత చంద్రబాబు టీడీపీని, రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడుపుతున్నారని కొనియాడారు. రాష్ట్రంలో రాక్షస పాలనను అధికారానికి దూరం చేసిన ప్రజలకు కన్నా కృతజ్ఞతలు తెలిపారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ మాట్లాడుతూ వందేళ్లయినా ప్రజల్లో ఎన్టీఆర్‌ది చెరగని ముద్ర అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ఆర్గనైజింగ్ సెక్రటరీ నాగోతు శౌరయ్య, దరువూరి నాగేశ్వరరావు, వేల్పుల ఆవుల రాజు, క్రాపా హరికృష్ణ, షేక్ అలీ బాషా, శ్రీను, మానం వెంకటేశ్వర్లు, అంకాళ్ళ ప్రభుదాసు తదితరులు పాల్గొన్నారు.

చిరుమామిళ్ళలో రేషన్ బియ్యం పట్టివేత

నాదెండ్ల, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చిరుమామిళ్ళ గ్రామలో శనివారం రాత్రి సుమారు వంద బస్తాల రేషన్ బియ్యాన్ని రెవెన్యూ శాఖ అధికారులు పట్టుకున్నారు. గ్రామంలోని శ్రీ వినాయక డ్వాక్రా మహిళా సంఘం పేరుతో పోతిరెడ్డి మల్లేశ్వరి షాపును నిర్వహిస్తున్నారు. గ్రామానికి చెందిన దగ్గెంపూడి రామిరెడ్డి జాయింట్ కలెక్టర్‌కు రేషన్ బియ్యం నిల్వలపై ఫిర్యాదు చేశారు. జేసీ ఆదేశాల మేరకు ఆర్ఐ సంతోషి కుమారి, వీఆర్వో ప్రేమ్‌రాజ్‌లు షాపును తనిఖీ చేశారు. రికార్డులో కంటే నిల్వ ఎక్కువగా ఉన్న బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. సోమవారం ఈ బియ్యాన్ని సివిల్ సప్లయీస్ అధికారులకు ఇస్తామని ఆర్ఐ తెలిపారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట/రెంటచింతల జూలై 13 (ఆంధ్రజ్యోతి):పులిచింతల ప్రాజెక్టులో ఆదివారం 15.40టీఎంసీల నీటినిల్వ ఉన్నట్టు ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. 4,600 క్యూసెక్కుల పవర్ జనరేషన్ ద్వారా నాలుగు వందల క్యూసెక్కులు లీకుల ద్వారా.. మొత్తం ఐదువేల క్యూసెక్కులు దిగువ కృష్ణకు విడుదల అవుతుంది.

8,700 క్యూసెక్కుల నీరు విడుదల

సత్రశాలలోని నాగార్జున సాగర్ టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టులో రెండు యూనిట్ల ద్వారా శనివారం అర్ధరాత్రి 12 గంటల వరకు 1 ఎంయూ(మిలియన్ యూనిట్) విద్యుత్ తయారైనట్లు ఎస్ఈ వేంకటరమణ, ఈఈ సుబ్రహ్మణ్యం ఆదివారం తెలిపారు. రేడియల్ క్రస్ట్ గేట్లన్నీ మూసి వేసినట్లు వెల్లడించారు. టేల్ రేస్ చానల్ ద్వారా పులిచింతలకు 8,700 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నామన్నారు. రిజర్వాయర్‌లో 6.711 టీఎంల నీరుండగా.. ఇది 245.93 అడుగులు, 74.96 మీటర్లకు సమానమన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.15 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	101, 109, 120
చికెన్ విత్ స్కిన్(కిలో)	194.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	205.00

బహిరంగ ధూమపానంపై జరిమానా

● సీఐ వెంకట్రావు



బహిరంగ మద్యపానంపై కేసులు రాస్తున్న సీఐ వెంకట్రావు, ఎస్ఐలు మోహన్, శివనాగరాజు

పిడుగురాళ్ల, జూలై 13 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలో బహిరంగ ధూమపానం చేసే వారిపై జరిమానా విధిస్తామని పట్టణ సీఐ వెంకట్రావు తెలిపారు. బహిరంగ ధూమపానంతోపాటు విద్యాలయాలకు 200 మీటర్ల దూరంలో పొగాకు ఉత్పత్తులను అమ్మినట్లైతే కేసులు నమోదు చేస్తామన్నారు. ఆదివారం రాత్రి స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. జానపాడు రోడ్డు, ఆర్టీసీ బస్టాండ్, ప్రధాన రహదారులపై బహిరంగ ధూమపానం చేసేవారిని గుర్తించి ఎస్ఐలు మోహన్, శివనాగరాజు జరిమానా విధించారు.

బెదిరించారు.. మట్టి అమ్ముకున్నారు

● దళిత నాయకుడు కోటేశ్వరరావు ఆవేదన



తన పొలంలో వైసీపీ నేతలు తవ్వకాలు జరిపిన ప్రాంతాన్ని చూపుతున్న కోటేశ్వరరావు

పిడుగురాళ్ల, జూలై 13(ఆంధ్రజ్యోతి): టీడీపీ హయాంలో 7వ విడత భూపంపిణీ పథకంలో ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తనతో పాటు మరికొందరికి పొలాలను కేటాయించారని కోనంకి గ్రామానికి చెందిన దళిత నాయకుడు లంజేపల్లి కోటేశ్వరరావు తెలిపారు. 2019 తరువాత వైసీపీ ప్రభుత్వ హయాంలో కోనంకి గ్రామానికి చెందిన వైసీపీ నేతలు తనను బెదిరించి ప్రభుత్వం తనకు కేటాయించిన పొలంలో వందలాది ట్రక్కుల మట్టిని అక్రమంగా తవ్వేసి లక్షలాది రూపాయలకు బైపాస్ రహదారికి అమ్ముకున్నారన్నారు. దీనివల్ల తన పొలం సాగుకు పనికిరాకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశాడు. తనతోపాటు మరికొంతమంది దళితుల భూముల్లో అక్రమంగా మట్టి తవ్వేశారని ఆయన తెలిపారు.

అంకమ్మ తల్లికి ఆషాఢం సారె సమర్పణ

పెదకూరపాడు, జూలై 13(ఆంధ్రజ్యోతి): పెదకూరపాడులోని అంకమ్మతల్లి దేవాలయంలో ఆదివారం మహిళలు ఆషాఢం సారె సమర్పించారు. తెల్లవారుజాము నుంచే భక్తులు 108 బిందెలతో జలాభిషేకం చేసి అమ్మవారిని అలంకరించారు. అనంతరం గ్రామ వీధుల్లో శోభాయాత్ర నిర్వహించి సారె సమర్పించారు.

గంగమ్మ దేవాలయంలో పూజలు

మాచవరం, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ఆషాఢ మాసాన్ని పురస్కరించుకొని మండలంలోని కొత్త గణేషునిపాడు గ్రామంలో గంగమ్మ తల్లి దేవాలయంలో అమ్మవారిని అలంకరించారు. భక్తులు ప్రత్యేక పూజలు చేసి నైవేద్యం సమర్పించారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.

అమ్మవారికి శాకాంబరి దేవి అలంకారం

సత్తెనపల్లి, జూలై 13(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పుతుంబాక వెంకటపతి కాలనీలో వేంచేసి ఉన్న శ్రీనీలంపాటి లక్ష్మీ అమ్మవారి పీఠంలో ఆదివారం శాకాంబరి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని కూరగాయాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులు అమ్మవారికి బోనాలు చెల్లించారు. ఆలయ నిర్వాహకురాలు శ్యామలాంబ పర్యవేక్షించారు.

శాకాంబరిదేవిగా పోలేరమ్మ..

దుర్గి, జూలై 13 (ఆంధ్రజ్యోతి): దుర్గిలో ఉన్న గ్రామ దేవత పోలేరమ్మ అమ్మవారిని ఆషాఢమాసం సందర్భంగా ఆదివారం శాకాంబరిదేవిగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు.

ఆక్రమణల తొలగింపు

సత్తెనపల్లి, జూలై 13(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తాలూకా సెంటర్‌లో ఉన్న ఆక్రమణలను, దుకాణాలను మున్సిపల్ అధికారులు తొలగించారు. తాలూకా సెంటర్‌లో గుంటూరు వెళ్ళే బస్సుల కోసం ప్రయాణీకులు నిత్యం వేచి ఉంటారు. బస్ షెల్టర్ లేకపోవటంతో ప్రయాణీకులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ ప్రాంతాలో బస్ షెల్టర్‌ను నిర్మించేందుకు అధికారులు ఆక్రమణలను తొలగించారు.

ఉచిత వైద్యశిబిరానికి స్పందన

ముప్పాళ్ళ, జూలై 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని దమ్మాలపాడు హైస్కూల్‌లో సత్తెనపల్లి సాయికృష్ణ మల్టీస్పెషాలిటీ హాస్పటల్ వైద్యుడు డాక్టర్ సింగరాజు సాయికృష్ణ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. వైద్యులు సింగరాజు సాయికృష్ణ, డాక్టర్ ఆకుల శివప్రసాద్, డాక్టర్ సాయికృష్ణారెడ్డి, డాక్టర్ సింగరాజు విద్యులు వైద్యపరీక్షలు నిర్వహించారు. 350 మందికి పైగా వైద్యపరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు.

ముస్లిం మైనార్టీ సమస్యల పరిష్కారమే లక్ష్యం


పెదకూరపాడు, జూలై 13(ఆంధ్రజ్యోతి): ముస్లిం మైనార్టీ వర్గాల సమస్యల పరిష్కారమే తమ లక్ష్యమని రాష్ట్ర అధ్యక్షుడు జనాబ్ కలీం అన్నారు. పెదకూరపాడులో ఆదివారం ముస్లిం యునైటెడ్ ఫ్రంట్ పెదకూరపాడు నియోజకవర్గ ముఖ్య నేతల సమావేశం జరిగింది. కార్యక్రమంలో ముస్లింల సమస్యలు, వాటి పరిష్కారంపై పలువురు చర్చించారు.

● పెదకూరపాడు నియోజకవర్గ ముస్లిం యునైటెడ్ ఫ్రంట్ అధ్యక్షుడిగా షేక్ ఇబ్రహీంను నియమిస్తూ నియామక పత్రాన్ని రాష్ట్ర అధ్యక్షుడు కలీం అందించారు. మండల ఆటో యూనియన్ అధ్యక్షుడిగా షేక్ ఖాశిం పీరాను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నేతలు షేక్ అక్బర్ తదితరులు పాల్గొన్నారు.

భగవద్గీత గ్రంథ ప్రచారం

అచ్చంపేట, జూలై 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండూరు, నిండుజర్ల గ్రామాల్లో భగవద్గీత గ్రంథ ప్రచారం నిర్వహించారు. త్రైతసిద్ధాంత ప్రబోధ సేవాసమితి, పిడుగురాళ్ళకు చెందిన హిందూజ్ఞానవేదిక కమిటీసభ్యులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమ్మె



ఐలాండ్ సెంటర్‌లో దీక్షలో పాల్గొన్న మున్సిపల్ కార్మికులు

పిడుగురాళ్ల, జూలై 13 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా పిడుగురాళ్ల మున్సిపల్ కార్మికులు ఆదివారం సమ్మెలో పాల్గొన్నారు. దశల వారీగా ఆందోళన చేసి రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి పారిశుధ్య, ఇంజనీరింగ్ కార్మికులకు న్యాయంజరిగేలా పోరాటం చేస్తామన్నారు. కనీస వేతనం 26వేలు ఇవ్వాలని, రిటైర్‌మెంట్ వయసు 60 ఏళ్లకు పెంచాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ సమ్మె నిర్వహిస్తున్నట్లు సీఐటీయూ నాయకులు తెలగపల్లి శ్రీను తెలిపారు. కార్యక్రమంలో వేముల శ్రీను, మధు, రమేష్, పవన్‌కుమార్, వాసా ప్రతాప్, రాజు, గోవిందు తదితరులు పాల్గొన్నారు. అలాగే సున్నం మిల్లు కార్మికుల కూలిరేట్లపై ఒప్పందం జరగాల్సి వుందన్నారు. కార్యక్రమంలో సున్నంమిల్లు కార్మికులు పాల్గొన్నారు.

చివరి వరకు కష్టపడుతున్నారు!

● గురజాలలో శరవేగంగా సాగునీటి కాల్వల మరమ్మతులు
● చివరి ఆయకట్టుకూ నీరందించేందుకు ఎమ్మెల్యే కృషి
● గతంలో పనులు చేయకుండానే జేబులు నింపుకున్న నేతలు
● నీరందక మాగాణిలోనూ మెట్ట పంటలు పెట్టిన రైతులు



బాగు చేయకముందు పిల్లుట్ల మేజర్ కాల్వ దుస్థితి, బాగుచేసిన తరువాత కాల్వ

పిడుగురాళ్ల, జూలై 13(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో నేతల నిర్లక్ష్యానికి.. గురజాల నియోజకవర్గంలో రైతులకు సాగునీటి కష్టాలు రెట్టింపు అయ్యాయి. గత ఐదేళ్లలో తంగెడ, ఆకురాజుపల్లె, దైద, గొట్టిముక్కల మేజర్ కాల్వలతో పాటు మైనర్ కాల్వలకూ మరమ్మతులు చేయకుండానే మమ అనిపించారు. అప్పటి పాలకులు, కాంట్రాక్టర్లు సిండికేట్ అయ్యి జేబులు నింపుకున్నారు. దీంతో గుంటూరు మేజర్ కాల్వ నుంచి సుమారు ఐదు కిలో మీటర్ల దూరంలో ఉన్న.. మోర్జంపాడుకు, 10 కిలో మీటర్ల దూరంలో ఉన్న మాచవరానికి, దైద గ్రామ చివరి భూములకు సాగునీరందడం కష్టతరంగా మారడంతో.. గత ఐదేళ్ల మాగాణి భూముల్లో కూడా రైతులు మెట్టపంటలు సాగు చేపట్టారు. వారబందీ అమలు చేసినప్పటికీ, రైతులు రేయింబవళ్లు కాల్వలపై పహారా కాసినా.. సాగునీరందక.. ఏడాది పాటు కొంతమంది రైతులు పంటలు వేయకుండా చివరి భూములను ఖాళీగా ఉంచుకున్నారు.

రూ.కోటి కాజేసినా పట్టించుకోలేదు..

తంగెడ, ఆకురాజుపల్లె మేజర్ కాల్వలకు రెండేళ్ల క్రితం జంగిల్ క్లియరెన్స్, పూడికతీత, కాల్వ కట్టల బలోపేతం వంటి పనులకు సుమారు రూ.కోటికి పైగా నిధులు మంజూరయ్యాయి. అప్పటి పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ ఈ నిధులు నొక్కేశాడని తెలిసినా.. అప్పటి ఉన్నతాధికారులు గానీ, నాటి పాలకులు గానీ పట్టించుకోలేదు. ఈ అవినీతిలో ఎవరి వాటాలు వారికి వెళ్లడం వల్ల మిన్నకుండిపోయారని రైతులు ఆరోపిస్తున్నారు. తమ కళ్లెదుటే కాల్వలు అధ్వానంగా ఉన్నప్పటికీ.. వాటికి మరమ్మతులు చేసినట్లు నిధులు డ్రా చేయడం అతిపెద్ద అవినీతి అని పెదఅగ్రహారం, మోర్జంపాడు, పిల్లుట్ల, పిన్నెల్లి రైతులు ఆరోపిస్తున్నారు.

కూటమి ప్రభుత్వం వచ్చాక..

ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు సాగర్ కాల్వల పరిధిలోని నియోజకవర్గంలో ఉన్న మేజర్, మైనర్ కాల్వలను ఆధునీకీకరించి చివరి భూముల వరకు సాగునీరందించాలన్న ఉద్దేశంతో రైతులతో పలుమార్లు సమావేశం నిర్వహించారు. యుద్ధప్రాతిపదికన ఖరీఫ్‌లో ఎక్కడెక్కడ పనులు అవసరమో గుర్తించి, అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే పనులు పూర్తిచేయించారు. మిగిలిన పనులను పూర్తి చేసేందుకు అధికారులను అప్రమత్తం చేస్తున్నారు. రూ.2.17కోట్ల నిధులు మంజూరు చేయించి.. తంగెడ, ఆకురాజుపల్లె మేజర్, మైనర్ కాల్వల్లో ఆధునికీకరణ పనులు చేపడుతున్నారు. ఖరీఫ్‌కు పనులు పూర్తిచేసి సాగునీరు అందించేందుకు కృషి చేస్తున్నట్లు పిడుగురాళ్ల డీఈ ఆదినారాయణ తెలిపారు.

సుపరిపాలన తొలిఅడుగుకు విశేష స్పందన



ఎండ్రాయిలో ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రవీణ్

అమరావతి, జూలై 13(ఆంధ్రజ్యోతి): టీడీపీ నిర్వహిస్తున్న సుపరిపాలనకు తొలిఅడుగు కార్యక్రమానికి ప్రజల నుండి విశేష స్పందన లభిస్తోందని ఎమ్మెల్యే ప్రవీణ్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని ఎండ్రాయి గ్రామంలో నిర్వహించిన సుపరిపాలనకు తొలిఅడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. ముందుగా ఎన్‌టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఇంటింటికి తిరిగి ప్రభుత్వ పనితీరు, సంవత్సరకాలంలో అమలుచేసిన సంక్షేమ కార్యక్రమాలపై ప్రజల అభిప్రాయం తెలుసుకున్నారు. కరపత్రాలను ఇంటింటికి అందజేశారు. సంగం డెయిరీ డైరెక్టర్ వి.ధర్మారావు, జె.నరేంద్ర, మండల నాయకులు పాల్గొన్నారు.

త్వరలోనే వెంకటాయపాలెం రోడ్డుకు మోక్షం

● ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్



వెంకటాయపాలెం గ్రామస్తులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే ప్రవీణ్

బెల్లంకొండ, జూలై 13(ఆంధ్రజ్యోతి): అతి త్వరలోనే బెల్లంకొండ మండలంలోని వెంకటాయపాలెం జడ్పీ రోడ్డుకు మోక్షం లభిస్తుందని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. ఆదివారం వెంకటాయపాలెం గ్రామానికి చెందిన కొంతమంది కూటమి నాయకులు గుంటూరు ఎమ్మెల్యే కార్యాలయంలో ప్రవీణ్‌ను కలిశారు. ఈ సందర్భంగా కూటమి నాయకులు మాట్లాడుతూ బెల్లంకొండ మండలంలోని మన్నెసుల్తాన్‌పాలెం నుంచి వెంకటాయపాలెం వరకు జడ్పీ రోడ్డు అధ్వానంగా ఉందని, ద్విచక్రవాహనాలు సైతం వెళ్ళేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎమ్మెల్యేకు తెలిపారు. స్పందించిన ఎమ్మెల్యే అతి త్వరలోనే రోడ్డు నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అంతేగాకుండా వెంకటాయపాలెం నుంచి పెద సింగరస్వామి, చిన సింగరస్వామి ఆశ్రమం వరకు రోడ్డును నిర్మించాలని ఎమ్మెల్యేని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే త్వరలోనే మీ సమస్యలన్నింటినీ పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు.

● మండలంలోని వన్నాయపాలెం గ్రామాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే ప్రవీణ్ పేర్కొన్నారు. ఆదివారం వన్నాయపాలెం గ్రామ టీడీపీ నాయకులు గుంటూరులో ఎమ్మెల్యేని కలిశారు. వన్నాయపాలెం అంతర్ రోడ్ల నిర్మాణానికి నిధులు కేటాయించాలని కోరారు. చర్యలు చేపడతానని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఎమ్మెల్యేను కలసిన వారిలో టీడీపీ నాయకులు సురేష్, వాసు, చెన్నకేశవరావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతు బ్రహ్మారెడ్డి కుటుంబానికి అండగా ఉంటాం

మాచర్ల రూరల్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): కౌలు రైతు బ్రహ్మారెడ్డి ఇంట జరిగిన విషాదం ఎవరూ పూడ్చలేనిదని, అతని కుటుంబానికి అండగా ఉంటామని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ మండలంలోని కొత్తపల్లిలో ఏడాది కాలంలోనే కౌలు రైతు బ్రహ్మారెడ్డి, అతని భార్య సుబ్బమ్మల మరణాలు కలచివేశాయన్నారు. తల్లిదండ్రులు లేక అనాధలుగా మారిన వారి పిల్లలు అఖిల్‌రెడ్డి, లక్ష్మీకార్తిక చదువులకు తన వంతు బాధ్యత తీసుకుంటానన్నారు.

దళితుల హక్కుల కోసం పోరాటం చేసిన రంజన్‌బాబు

మాచవరం, జూలై 13(ఆంధ్రజ్యోతి): దళిత హక్కుల కోసం పోరాటంచేసిన జాతీయ దళిత నాయకుడు డాక్టర్ పీ రంజన్‌బాబు అని కార్ఫ్ సంస్థ డిప్యూటీ డైరెక్టర్ తాళ్ళూరి అమరనాథ్ తెలిపారు. ఆదివారం రంజన్ జయంతి సందర్భంగా పిన్నెల్లి ఎస్సీ కాలనీలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో తాళ్ళూరి సురేష్‌చంద్, రాయపాటి దానయ్య, చింతల అన్నారావు, రాయపాటి ఇస్రాయేలు, బద్రి, కోటేశ్వరరావు, వెంకటరత్నం, కోయ ప్రభుదాసు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రంజన్‌బాబు జయంతి

దుర్గి, జూలై 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముటుకూరు ఎస్సీకాలనీలో బాలబాట ఏసీవో కుక్కమూడి ప్రమీల ఆధ్వర్యాన కార్ఫ్‌సంస్థ అధినేత డాక్టర్ రంజన్‌బాబు జయంతిని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా దళిత బహుజన సంక్షేమ సేవా సంఘం వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు కె.ప్రసాద్ మాట్లాడారు. అనంతరం రంజన్‌బాబు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కటికల యేసుదానం, మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.

అన్నదాత సుఖీభవ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

కారంపూడి, జూలై 13 (ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏవో పోట్ల నరసింహారావు కోరారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ అర్హులైన రైతుల జాబితాలు గ్రామాల్లోని రైతు సేవాకేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయని, జాబితాలో పేర్లు లేని రైతులు రైతు సేవాకేంద్రాల్లో సంప్రదించాలన్నారు.

నియోజకవర్గ అభివృద్ధి యరపతినేనితోనే సాధ్యం

● టీఎన్ఎస్ఎఫ్ నేత మస్తాన్



సంక్షేమ పథకాలను వివరిస్తున్న టీఎన్ఎస్ఎఫ్ నేత మస్తాన్

గురజాలటౌన్, జూలై 13(ఆంధ్రజ్యోతి): గురజాల నియోజకవర్గ అభివృద్ధి ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావుతోనే సాధ్యమని టీఎన్ఎస్ఎఫ్ నేత షేక్ మస్తాన్ అన్నారు. ఆదివారం మండలంలోని పల్లెగుంతలో నిర్వహించిన సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికి తిరిగి ఏడాది కూటమి ప్రభుత్వ పాలనలో అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో అప్పటి ఎమ్మెల్యే కాసు అభివృద్ధిని గాలికి వదిలేసి అరాచకం సృష్టించారని మండిపడ్డారు. ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన పల్లెగుంతకి చెందిన షేక్ నాసర్‌వలి భార్య సైదాబికి రూ.5వేల ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో కాపూరి బాబురావు, సాయి, అడవి వెంకటేశ్వర్లు, సైదావలి, రాయపాటి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నోరు అదుపులో లేకపోతే తరిమికొడతారు

● టీడీపీ సీనియర్ నేత యాగంటి



విలేకరులతో మాట్లాడుతున్న యాగంటి

మాచర్లటౌన్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి పేర్ని నాని, నెల్లూరుకు చెందిన ప్రసన్నకుమార్‌రెడ్డిలు నోటికి వచ్చినట్లు మాట్లాడితే జనం రాష్ట్రం నుంచి తరిమికొడతారని టీడీపీ సీనియర్ నేత యాగంటి మల్లికార్జునరావు అన్నారు. ఆదివారం పట్టణంలోని తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పేర్ని నాని నోటికి వచ్చినట్లు మాట్లాడి రాష్ట్రంలో అలజడి సృష్టించాలని చూస్తున్నారని విమర్శించారు. మాజీ సీఎం జగన్‌రెడ్డి ఎక్కడికి వెళ్లినా అక్కడ గొడవలు చేయాలని చూడడం వైసీపీ నీతిమాలిన రాజకీయానికి నిదర్శనంగా పేర్కొన్నారు. మీ ఇష్టం వచ్చినట్లు చేయండి అధికారంలోకి వచ్చిన తరువాత నేను చూసుకుంటానని అంటూ నాని మాట్లాడడం హత్యా రాజకీయాలను ప్రోత్సహించడమేనన్నారు. మాజీ ఎమ్మెల్యే ప్రసన్నకుమార్ రెడ్డి మహిళలపై ఇష్టానుసారంగా మాట్లాడడంతో మహిళలు తగిన శాస్తి చేశారన్నారు. టీడీపీ చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకనే వైసీపీ నేతలు ప్రజలను తప్పుదారి పట్టించాలని చూస్తున్నారన్నారు. జగన్ తన అనుచరులను రెచ్చగొడుతూ ఎక్కడికక్కడ గొడవలు సృష్టించాలని ప్రేరేపిస్తున్నట్లు అర్థమవుతుందన్నారు. సమావేశంలో సంతోష్, తిక్కా కొండలు, దుర్వాకుల ప్రసాద్, గాజుల ఆంజనేయులు, బాదన్‌బాయి, బొట్టు కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చీకట్లో కన్ను కొడితే ఎవరికీ కనిపించదు

● టీడీపీ నేతలు సురేష్ యాదవ్, బాలకృష్ణ

కారంపూడి, జూలై 13 (ఆంధ్రజ్యోతి): చీకట్లో కన్ను కొడితే ఎవరికీ కనిపించదు పేర్ని నాని.. ఆ మాత్రం తెలుసుకోని వాడివి నువ్వు మంత్రి పదవిలో ఎలా కొనసాగావు.. జిల్లా పార్టీ అధ్యక్షుడిగా ఎలా చలామణి అవుతున్నావంటూ టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి గోళ్ల సురేష్ యాదవ్, కారంపూడి పట్టణ అధ్యక్షుడు కటికల బాలకృష్ణ ఎద్దేవా చేశారు. కారంపూడిలో ఆదివారం వారు విలేకరులతో మాట్లాడారు. నువ్వు చీకట్లో కన్ను కొడితే మీవాళ్ల చీకట్లోనే కలిసిపోతారని తెలుసుకొని మాట్లాడితే మంచిదని సలహా ఇచ్చారు. పార్టీ అధ్యక్షుడు క్రిమినల్ అయినప్పుడు నాయకులను కూడా క్రిమినల్స్‌గా మార్చాలని చూడడంలో ఆశ్చర్యం లేదన్నారు. వైసీపీ అధికారంలో ఉన్న ఐదేళ్లలో దౌర్జన్యాలు, భూ ఆక్రమణలు, అక్రమ పోలీసు కేసులు, మనుషుల గొంతులు కోయడం తప్ప అభివృద్ధి చేశారా అని ప్రశ్నించారు. ఎన్నికల్లో ప్రజలు 11 సీట్లకే పరిమితం చేసినా వైసీపీ నేతలకు బుద్ధి రాలేదని అన్నారు.

ఇంటర్నేషనల్ డెలిగేట్‌గా వేణుగోపాల్ ఎంపిక

సత్తెనపల్లి, జూలై 13 (ఆంధ్రజ్యోతి): నేపాల్ రాజధాని ఖాట్మండ్‌లో ఈనెల 18 నుంచి 21వ తేదీ వరకు జరగనున్న 19వ ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఆఫ్ డెమొక్రటిక్ లాయర్స్ సెమినార్‌కు హాజరుకానున్న భారతదేశ న్యాయవాదుల ప్రతినిధి బృందంలో సత్తెనపల్లికి చెందిన న్యాయవాది నరిచేటి వేణుగోపాల్ ఎంపికయ్యారు. ఆయన ఎంపిక పట్ల పలువురు న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు.

ప్రజలు ఛీకొట్టినా మారని వైసీపీ నాయకుల వైఖరి

● టీడీపీ జిల్లా నాయకుడు కంచేటి సాయిబాబు

క్రోసూరు, జూలై 13(ఆంధ్రజ్యోతి): ప్రజలు ఛీ కొట్టి కేవలం 11 సీట్లే కట్టబెట్టినా వైసీపీ నాయకుల తీరు మారటం లేదని టీడీపీ జిల్లా నాయకుడు కంచేటి సాయిబాబు విమర్శించారు. బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ పేరుతో వైసీపీ నాయకులు చేస్తున్న దుష్ప్రచారాన్ని టీడీపీ నాయకులు ఖండించారు. ఆదివారం క్రోసూరులో విలేకరులతో మాట్లాడుతూ సంవత్సర కాలంలో రాష్ట్రంలో గాని, పెదకూరపాడు నియోజకవర్గంలో గాని జరిగిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను చూసి ఓర్వలేకనే వైసీపీ నాయకులు విమర్శలు చేస్తున్నారన్నారు. మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ఉనికిని కాపాడుకోవటానికి రెండు మూడు నెలలకు ఒక సారి నియోజకవర్గానికి వచ్చి విమర్శలు చేసి వెళ్తున్నారని ఎద్దేవా చేశారు. సమావేశంలో టీడీపీ జిల్లా, మండల నాయకులు ఏపూరి నాగేశ్వరరావు, నలజాల సదాశివరావు, మొగల్‌జాన్, తోకా వెంకటరావు, దిగుమత్తి అప్పారావు, అనుముల వెంకటరామిరెడ్డి, దూళ్ళ సాంబశివరావు, కంచేటి నరసింహారావు, గాదె సూర్యనారాయణ, శాఖమూరి శ్రీనివాసరావు, లేళ్ళ వెంకటరావు, చావా మురళీ, పిల్ల కతుపుల రామయ్య, మస్తాన్‌వలి, దుద్దుల యోహాన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టీడీపీ జిల్లా నాయకుడు కంచేటి సాయిబాబు తదితరులు

రామారావుకు ఎమ్మెల్యే ప్రవీణ్ సన్మానం

అచ్చంపేట, జూలై 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని వేల్పూరు సొసైటీ పర్సన్ ఇన్‌చార్జ్‌గా నియమితులైన జవ్వా రామారావును ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ దుశ్శాలువాతో సన్మానించారు. సభ్యులు పాటిబండ్ల వెంకటేశ్వర్లు, కుంబా లక్ష్మణ్, సంగం డెయిరీ మాజీ చైర్మన్ కిలారి రాజన్‌బాబు తదితర టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

● ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి రూరల్, జూలై 13(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యే యమని, ఆ దిశగా ప్ర భుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. మం డలంలోని వెన్నాదేవి - వావిలాల నగర్‌లో రూ.1,32,50,000 నిర్మించనున్న కమ్యూనిటీ క ల్యాణ మండపాన్ని ఎమ్మెల్యే ఆదివారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల హామీల్లో భాగంగా ఏడాది పరిపాలనలో హామీలన్నీ ఒక్కొక్కటిగా అమలుచేస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానిదేనన్నారు. ఈ ప్రభుత్వ కాలంలో పల్లెల్లో అభివృద్ధి శరవేగంగా జరుగుతుందన్నారు. అనంతరం రెప్‌కో బ్యాంక్ ఆర్థిక సహకారంతో అందించిన కుట్టుమిషన్‌లను ఒంటరి మహిళలు 61మందికి ఎమ్మెల్యే పంపిణీ చేశారు. బ్యాంక్ ద్వారా విద్యార్థులకు అందించిన స్కాలర్‌షిప్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బ్యాంక్ ప్రతినిధులు, నియోజక వర్గ, పట్టణ, మండల టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

దోచేసి ఇప్పుడు నిందలా.. : ఏఎంసీ చైర్మన్ వీరస్వామి

పిడుగురాళ్ల, జూలై 13 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కోనంకి గ్రామంలో ప్రభుత్వభూముల్లో మట్టిని ఇష్టానుసారంగా విక్రయించి ఇప్పుడు రైతులపై నిందలు వేస్తున్నారని ఏఎంసీ చైర్మన్ తురకా వీరస్వామి, మండల పార్టీ కన్వీనర్ గండికోట వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీపీ యడ్లపల్లి నారాయణలు వైసీపీ నేతలపై మండిపడ్డారు. ఆదివారం పట్టణ పార్టీ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ పరామర్శకు వెళ్లి రాజకీయాల గురించి మాట్లాడే అర్హత కాసు మహేష్‌రెడ్డికి, ఆ పార్టీ నేతలకు లేదన్నారు. గత ఐదేళ్లలో ఆ గ్రామంలో ఏమి అభివృద్ధి చేశారో.. 2014-19 మధ్య టీడీపీ హయాంలో ఎంత అభివృద్ధి జరిగిందో చర్చకు సిద్ధమా అని ప్రశ్నించారు. టీడీపీ కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టి వేధించిన వైసీపీ నేతలు ఇప్పుడు అక్రమాల గురించి మాట్లాడటం సిగ్గుచేటన్నారు. ప్రభుత్వభూముల్లో వందలాది ట్రక్కులు, టిప్పర్ల ద్వారా మట్టిని బైపాస్ రహదారికి తరలించి లక్షల రూపాయలు సొమ్ము గడించిన మాట నిజం కాదా అని ప్రశ్నించారు. సమావేశంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు పి.శ్రీను, మైనారిటీ సెల్ అధ్యక్షుడు అమీర్‌అలి, ఎం.సాంబశివరావు, ఎన్.శ్రీనివాసరెడ్డి, డి.వెంకటేశ్వరరెడ్డి, ఎం.డేవిడ్, పి.రాజేశ్వరి, షేక్ షబ్బీర్, ఎం.రాంబాబు, వై.శివ, ఎం.సాంబయ్య, కె.జాని, కె.సైదా, జె.రామకృష్ణ, ఎం.శివ, పిచ్చారావు పాల్గొన్నారు.

పేదల జీవితాల్లో వెలుగులు నింపడమే కూటమి ప్రభుత్వ ధ్యేయం



బుచ్చయ్యపాలెంలో కరపత్రాలను పంపిణీ చేస్తున్న టీడీపీ మండల అధ్యక్షుడు ఏటుకూరి బ్రహ్మయ్య

పెదకూరపాడు, జూలై 13(ఆంధ్రజ్యోతి): పేదల జీవితాల్లో వెలుగులు నింపటమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని టీడీపీ మండల అధ్యక్షుడు ఏటుకూరి బ్రహ్మయ్య అన్నారు. మండలంలోని బుచ్చయ్యపాలెం, రామాపురం గ్రామాల్లో ఆదివారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో తెలుగు రైతు జిల్లా ప్రధానకార్యదర్శి బి.ఆంజనేయులు, బెల్లంకొండ రామగోపాలరావు, గల్లా బాబూరావు, వడ్లమూడి అప్పారావు, పరుచూరి పూర్ణచంద్రరరావు, ఎన్.నాగేశ్వరరావు, కె.వీరసింహం, జి.లీలావతి, పి.శ్రీధర్, చంద్ర పూర్ణచంద్రరరావు, కె.సుజాత, ఏ శివయ్య, ఎస్.కృష్ణకుమారి, అంద్ర ప్రసాదు, కె.మస్తాన్‌రావు, పి.శ్రీనివాసరావు, వి.వెంకటరావు, షేక్ సలీం, సీహెచ్ శివాజీ, కె.ప్రసాదు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

కారంపూడి, జూలై 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఒప్పిచర్ల గ్రామానికి చెందిన చీమలదిన్నె అంకాలు అనారోగ్యంతో ఆదివారం మృతిచెందారు. ఆదివారం టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యదర్శి పంగులూరి పుల్లయ్య రూ.5వేలు, కొండపల్లి చిన అప్పారావు రూ.2వేలను మట్టి ఖర్చుల నిమిత్తం కుటుంబసభ్యులకు అందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పుష్పలత శివరాం, మాదల సత్యనారాయణ, చిరుమామిళ్ల రామలక్ష్మయ్య, శ్రీను, నీళ్ల అంజయ్య, రెబ్బలపల్లి అమరయ్య, దేవరకొండ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి...

కారంపూడిలో టీడీపీ కార్యకర్త కుంచవరపు ఈశ్వరమ్మ అనారోగ్య కారణాలతో ఆదివారం మృతిచెందారు. టీడీపీ నేతలు ఆమె భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. మట్టి ఖర్చుల నిమిత్తం రూ.10 వేల ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కటికల బాలకృష్ణ, మస్తాన్ జానీ, బొల్నేడి కోటేశ్వరరావు, బాలునాయక్ తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో మహిళా డాక్టరును నియమించాలి

రెంటచింతల, జూలై 13(ఆంధ్రజ్యోతి): రెంటచింతల పీహెచ్‌సీలో మహిళా డాక్టర్‌ను నియమించాలని టీడీపీ నేతలు ఆదివారం ఓ ప్రకటనలో కోరారు. గతంలో ఇక్కడ విధులు నిర్వహించిన డాక్టర్ హేమ చిత్తూరు జిల్లాకి బదిలీ అయ్యారన్నారు. ఇక్కడ ఓపీ అధికంగా ఉంటుందని, మహిళా రోగులు ఎక్కువ మంది ఆసుపత్రికి వస్తున్న క్రమంలో మహిళా డాక్టర్‌ను నియమించాలని కోరారు. ప్రకటన విడుదల చేసిన వారిలో టీడీపీ రైతు విభాగం పార్లమెంట్ కార్యదర్శి చేరెడ్డి కృష్ణారెడ్డి తదితరులు ఉన్నారు.

ఆగస్టు 15 లోపు పంటల బీమా చెల్లించాలి

రెంటచింతల, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి ఫసల్ బీమా పథకంలో చేరేందుకు ఆగస్టు 15 లోపు రైతులు తమ ప్రీమియం చెల్లించాలని ఏవో కట్టా లక్ష్మారెడ్డి, ఎంపీఈవో రాంబాబునాయక్‌లు కోరారు. వరి, పత్తి రైతులు 15వ తేదీ లోపు, మినుము రైతులు జూలై 31 లోపు చెల్లించాలని వారు కోరారు.

సాగరమాత ఆలయంలో భక్తుల సందడి

మాచర్ల రూరల్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విజయపురిసౌత్‌లో ఉన్న సాగరమాత ఆలయంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు మొక్కుబడులు చెల్లించుకున్నారు. విచారణ గురువులు ఫాదర్ జోసఫ్ బాలసాగర్ దివ్య పూజాబలి నిర్వహించారు. అనంతరం తేరు ప్రదక్షణ గావించారు.

పల్నాడు వార్తలు

• నరసరావుపేట • వినుకొండ • చిలకలూరిపేట



ఆస్తి వివాదంలో కత్తితో దాడి

నరసరావుపేట లీగల్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ఆస్తి వివాదం నేపథ్యంలో శనివారం అర్ధరాత్రి కత్తితో ఓ యువకుడిపై అతని పెదనాన్న దాడికి పాల్పడ్డాడు. పట్టణంలోని షాలెంనగర్‌లో మహబూబ్ బాషా అనే యువకుడిపై అతని పెదనాన్న కత్తితో గొంతుపై దాడిచేసినట్లు స్థానికులు తెలిపారు. వెంటనే గాయపడిన బాషాను చికిత్స నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న మొదటి పట్టణ పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని చికిత్స పొందుతున్న బాధితుడి నుంచి వాంగ్మూలం నమోదు చేసుకొని కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు


గాయపడిన డ్రైవర్ వెంకటేష్

వినుకొండ టౌన్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శివాపురం సమీపంలో ఆగి ఉన్న బొలెరోను వెనుక నుంచి ఓ లారీ ఢీకొనడంతో వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాలను పరిశీలిస్తే.. శివాపురం సమీపంలో బొలెరో డ్రైవర్ వెంకటేష్ వాహనాన్ని రోడ్డు పక్కన ఆపుకొని టాయిలెట్‌కు వెళ్తుండగా వెనుక నుంచి వచ్చిన లారీ ఢీకొనడంతో తీవ్రగాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న స్థానికులు 108 వాహనం ద్వారా వెంకటేష్‌ను ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రమాదంలో క్షతగాత్రుడి తలకు, కాళ్లకు బలైన గాయాలు తగిలినట్లు సమాచారం.

సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా ప్రాంతానికి చేరుకొని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు ఆదివారం తెలిపారు.

శ్రీరామకృష్ణ ఓరియంటల్ పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తా

వజ్రోత్సవాల్లో ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు

నరసరావుపేట టౌన్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): చరిత్ర కల్గిన శ్రీరామకృష్ణ ఓరియంటల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. ఆదివారం నరసరావుపేట పట్టణంలోని శ్రీరామకృష్ణ ఓరియంటల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల పూర్వవిద్యార్థుల ఆధ్వర్యంలో వజ్రోత్సవాలు పట్టాభిరామస్వామి ఆలయం ప్రాంగణంలో ఉన్న వెంకటేశ్వర కల్యాణ మండపంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి పాఠశాల మొదటి బ్యాచ్ పూర్వ విద్యార్థి ప్రొఫెసర్ డీఏఆర్ సుబ్రహ్మణ్యం అధ్యక్షత వహించారు. విశిష్ట అతిథిగా హాజరైన ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ పల్నాడులో ఉన్న ఏకైక సంస్కృత పాఠశాల శ్రీరామకృష్ణ ఓరియంటల్ పాఠశాల అన్నారు. ఈ పాఠశాలలో చదివి ప్రయోజకులై నేడు వందలాది పూర్వ విద్యార్థులు ఇక్కడ సమావేశమై సంతోషాన్ని పంచుకోవటం ఎంతో గొప్పగా ఉందన్నారు. పాఠశాల ప్రహరీ కోసం కృషి చేస్తానన్నారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ పూర్వ విద్యార్థులు చదువుకున్న పాఠశాలపై గౌరవభావంతో విచ్చేయటం సంతోషంగా ఉందన్నారు. పూర్వవిద్యార్థులు చదుకున్న పాఠశాల అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. మాజీ మున్సిపల్ చైర్మన్ నాగసరపు సుబ్బరాయగుప్తా మాట్లాడుతూ పాఠశాలను స్థాపించిన పండిత వేదాంతం రామకృష్ణచార్యులు ఆశయాలను కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థుల గౌరవాధ్యక్షుడు కపలవాయి విజయకుమార్, బీజేపీ నాయకుడు రంగిశెట్టి రామకృష్ణ, టీడీపీ పట్టణ అధ్యక్షుడు గట్టుపల్లి సత్యనారాయణ, మార్కెట్ యార్డు చైర్మన్ పూనాటి శ్రీనివాసరావు, పాఠశాల పాలకవర్గ ఉపాధ్యక్షుడు రొంపిచర్ల ఆంజనేయులు, ప్రధానోపాధ్యయుడు బీ సత్యనారాయణసింగ్, పూర్వవిద్యార్థులు జూలకంటి సీతారామాంజనేయులు, గట్టా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. తొలుత వై.త్యాగరాజు ప్రార్థనతో సభ ప్రారంభమైంది. పూర్వవిద్యార్థి ఆర్.శ్రీనివాసరావు సభకు స్వాగతం పలికారు. పూర్వ విద్యార్థులు తమ ఉపాధ్యాయులను ఆత్మీయంగా సన్మానించారు.

26 మంది పేద విద్యార్థులకు రూ.1.35 లక్షల ఉపకార వేతనాల పంపిణీ

చిలకలూరిపేట, జూలై 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సీఆర్ కాలనీ పార్కులో ఆదివారం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 26 మంది పేద విద్యార్థులకు రూ.1.35 లక్షల ఉపకార వేతనాలను తహసీల్దార్ షేక్ మహమ్మద్ హుస్సేన్ ముఖ్యఅతిథిగా పాల్గొని అందచేశారు. గుడిపల్లి సాంబశివరావు గారు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదివి మంచి ఉన్నత స్థానాల్లోకి రావాలని విద్యార్థులను కోరారు. వాకర్స్ అసోసియేషన్ కమిటీకి చెందిన పెరవలి రాఘవరావు, ఆరెకట్ల కోటి సుబ్బారావు, చిరుమెళ్ళ శ్రీనివాసరావు, పెద్ది శివరాం ప్రసాద్, సీహెచ్ సీతారామయ్య, వంకాయల రామాంజనేయులు పాల్గొన్నారు.




ఆలయంలో నిర్మాణంలో ఉన్న మండపం వద్ద విరాళం అందజేస్తున్న దాత గర్నీ సురేష్, కమిటీ సభ్యులు

శ్రీయోగానంద లక్ష్మీనరసింహస్వామి ఆలయ నిర్మాణానికి విరాళం

నరసరావుపేట టౌన్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కోటబజార్ పులుపుల వారి వీధిలోని వీరాంజనేయ సహిత శ్రీయోగానంద లక్ష్మీనరసింహస్వామి ఆలయం రాతి నిర్మాణానికి దాతలు విరాళం అందజేశారని కమిటీ సభ్యులు పులుపుల రాము ఆదివారం తెలిపారు. స్మార్ట్ కిడ్స్ ఇండియా ఇన్నోవేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ అధినేత గర్నీ సురేష్ దేవాలయ ముఖ మండప 10వ స్తంభం కోసం రూ.3లక్షలు విరాళాన్ని కమిటీకి అందజేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు వనమా శివ, వనమా కృష్ణ, వనమా శ్రీనివాసరావు, కోవూరు శివశ్రీనుబాబు, గజవల్లి మురళి, కొప్పురావురి నాగేశ్వరరావు, మున్నలూరి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


గంగా మహాలక్ష్మీ అమ్మవారు, అమ్మవారికి సారె తెస్తున్న మహిళలు

గంగా మహాలక్ష్మీ అమ్మవారికి సారె సమర్పణ

నరసరావుపేట రూరల్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక వల్లపచెరువు సమీపంలోని గంగా మహాలక్ష్మీ అమ్మవారి దేవాలయంలో ఆదివారం, ఆషాఢ మాసం సందర్భంగా భక్తులు సారె సమర్పణ వైభవంగా నిర్వహించారు. ఆదివారం ఉదయం 8:00 గంటలకు పాతూరు ఆంజనేయస్వామి ఆలయం వద్ద నుంచి ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి సారె సమర్పించారు. ఈ సందర్భంగా అమ్మవారికి శాకంబరీ అలంకారం చేశారు. ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. అనంతరం మధ్యాహ్నం 12:30గంటలకు అన్నప్రసాద వితరణ నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారి ఆషాడం సారెను అందజేశారు.



కవి కరిముల్లాకు తిరుపతి వేంకట కవులు జీవన సాఫల్య పురస్కారం


కవి కరిముల్లా

వినుకొండ, జూలై 13 (ఆంధ్రజ్యోతి): తిరుపతి వేంకట కవులు జీవన సాఫల్య పురస్కారం 2025ను పట్టణానికి చెందిన కవి కరిముల్లాకు ఈ నెల 20వ తేదీన హిందూపురంలో ప్రదానం చేయనున్నారు. ఈ మేరకు తనకు సమాచారం అందినట్లు కవి కరిముల్లా ఆదివారం తెలిపారు.

ఘనంగా పోలేరమ్మ తల్లికి బోనాలు


బోనాలతో వస్తున్న భక్తులు

శావల్యాపురం, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ఆషాడ మాసాన్ని పురష్కరించుకొని శావల్యాపురంలోని కర్నూలు-గుంటూరు జాతీయ రహదారి పక్కనున్న పోలేరమ్మతల్లి దేవాలయంలో భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని నూతన వస్త్రాలు, పూలమాలలతో అలంకరించారు. మహిళలు బోనాలను తెచ్చి అమ్మవారికి సమర్పించి మొక్కుబడులు తీర్చుకున్నారు. అమ్మవారికి పసుపుకుంకుమలు, చీరెసారెలను కానుకగా సమర్పించారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు పాలడుగు అయ్యన్న, నాగాంజనేయులు, వీరాంజనేయులు, వెంకటకృష్ణయ్య పాల్గొన్నారు.

ఈపూరు సొసైటీ చైర్మన్‌గా హనుమయ్య బాధ్యతల స్వీకరణ

ఈపూరు, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ఈపూరు సొసైటీ చైర్మన్‌గా విడపలపాటి హనుమయ్య ఆదివారం బాధ్యతలు చేపట్టారు. చైర్మన్ హనుమయ్య, సభ్యులుగా అయినాల కోటేశ్వరరావు, సింధుకూరి నరసింహారావులతో సొసైటీ సీఈవో పోకా కోటేశ్వరరావు ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి రాపర్ల జగ్గారావు, మాజీ ఎంపీపీలు బొల్లా వెంకట కోటయ్య, బైలడుగు రామయ్య, అంగలూరు సొసైటీ చైర్మన్ టి.బాలయ్య, న్యాయవాది ఎస్.రామకోటేశ్వరరావు, ఎం.సత్యన్నారాయణ, సర్పంచ్‌లు జి.శ్రీనివాసరావు, ఎ.ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులకు శంకుస్థాపన


చిలకలూరిపేట వార్డులలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి

చిలకలూరిపేట, జూలై 13 (ఆంధ్రజ్యోతి): సుపరిపాలనలో తొలి అడుగులో భాగంగా పట్టణంలోని 8,18, 20, 22 వార్డులలో ఆదివారం ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు పర్యటించారు. ఈ వార్డులలో రూ.55 లక్షల వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆయన నియోజకవర్గంలో 9800 పేద కుటుంబాల్ని పీ-4 కింద ఎంపిక చేశారని, ఆ కుటుంబాలను అన్ని విధాల పైకి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఇళ్లు లేనివారు లేవని బాధపడుతుంటే, ప్రభుత్వమిచ్చిన టిడ్కో ఇళ్లలో ఉండకుండా వాటిని పాడు పెట్టడం సరికాదన్నారు. చంద్రబాబు నేరుగా ప్రజలవద్దకు వెళ్లి ఏం కావాలో చెప్పండని అడుగుతున్నారని, పనిచేసే నాయకుడికి, చేయని నాయకుడికి మధ్య ఉన్న తేడాను ప్రజలు గ్రహించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, వైస్ చైర్మన్ గోల్డ్ శ్రీను, బీజేపీ నాయకులు జయరామిరెడ్డి, టీడీపీ నాయకులు నెల్లూరి సదాశివరావు, షేక్ టీడీపీ కరీముల్లా, పి.సమద్‌ఖాన్, ఎం.రవి, కె.రమణ, ఎం.శివ, ఎం.మల్లిబాబు, ఎ.కోటేశ్వరరావు, ఆయా వార్డుల కౌన్సిలర్లు పాల్గొన్నారు.

● నాదెండ్ల: ముఖ్యమంత్రిగా చంద్రబాబు మరో పది సంవత్సరాలు ఉంటేనే యువతకు మంచి భవిష్యత్తు ఉంటుందని ఎమ్మెల్యే పత్తిపాటి పుల్లారావు అన్నారు. మండల కేంద్రమైన నాదెండ్లలో ఆదివారం రాత్రి జరిగిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్సీ కాలనీలో నిర్మించతలపెట్టిన వాటర్ ట్యాంక్‌కు ఆయన భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎస్ స్వరూపరాణి, ఏఈ శ్రీనివాసరావు, పార్టీ నాయకులు ఎన్.సదాశివరావు, బి.సత్యనారాయణ, ఎన్.హరిబాబు, కె.రమణ తదితరులు పాల్గొన్నారు.

రోటరీ కార్యవర్గం ప్రమాణస్వీకారం

నరసరావుపేట రూరల్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక వినుకొండ రోడ్‌లోని రోటరీ కమ్యూనిటీ హాల్లో నరసరావుపేట రోటరీ క్లబ్ నూతన కార్యవర్గం ప్రమాణస్వీకార కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డిస్ట్రిక్ గవర్నర్ నామిని రోటరీ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 3150 ఎం.హరిహరప్రసాద్, అసిస్టెంట్ గవర్నర్ పి రాఘవయ్యలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఫాస్ట్ ప్రెసిడెంట్ కపిలవాయి రాజేంద్రప్రసాద్, సెక్రెటరీ సాతులూరి శివకుమార్, ఫాస్ట్ గవర్నర్లు కేపీ రంగారావు, తాళ్ల రాజశేఖర్‌రెడ్డి, నూతనంగా ఎన్నికైన రోటరీ క్లబ్ అధ్యక్షులు షేక్ కరీం మొహిద్దిన్, సెక్రటరీ భవనం పునీందర్‌రెడ్డి, ట్రెజరర్ కట్టమూరి ఆంజనేయులు, రోటరీ క్లబ్ డైరెక్టర్లు ఎస్‌కే జిలాని మాలిక్, పి.శివ నాగరాజు, సీహెచ్ నాగలక్ష్మి సునీత, జమ్ముల రాధాకృష్ణ, వేమా వెంకటేశ్వరరావు, పోటు అచ్యుత్, పాశం కృష్ణారావు, పులిపాటి రమేష్, లింగ ఆంజనేయులు, ఫాస్ట్ ప్రెసిడెంట్ మేళ్లచెరువు వీరాంజనేయులు, చేకూరి సాంబశివరావు, రాయల శ్రీనివాసరావు, మామిడి సుబ్బారావు, మురారిశెట్టి వెంకటేశ్వరరావు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ మీరావలి, ఈశ్వర్ ఇంజనీరింగ్ కాలేజ్ సెక్రటరీ షేక్ మస్తాన్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

రైతు కుటుంబానికి ఆర్థిక సాయం

ఈపూరు, జూలై 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొచ్చెర్లలో గత నెల 17వ తేదీన అప్పుల బాధతో బండి కొండయ్య అనే కౌలు రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. కృష్ణా జిల్లాకు చెందిన కో-ఆపరేటివ్ సొసైటీ సబ్ రిజిస్ట్రార్ ఎన్.వెంకటేశ్వరరావు, కోటిపల్లి శ్రీనివాసరావులు రూ.15వేలు నగదు ఆదివారం కొండయ్య కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు అయినాల కోటేశ్వరరావు, గోలి వెంకయ్య, పంచాయతీ సెక్రటరీ తిరుపతయ్య ఉన్నారు.

ఇస్లాం పేటలో మెగా వైద్య శిబిరం

నరసరావుపేట టౌన్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఇస్లాంపేటలోని శ్రీగిరి మున్సిపల్ యూపీ స్కూల్‌లో ఆదివారం పల్నాడు విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో బసవ గ్యాస్ట్రోస్ లివర్ ఇనిస్టిట్యూట్ సౌజన్యంతో మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య శిబిరాన్ని కెనరా బ్యాంక్ ఛీఫ్ మేనేజర్ ఎస్‌బీ మరుదీశ్వరరావు, అసిస్టెంట్ మేనేజర్ ప్రవీణ్ కుమార్ ప్రారంభించారు. 129 మందికి ఈసీజీ, బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ వేమూరి ప్రసన్నకుమార్ వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో పల్నాడు విజ్ఞాన కేంద్రం షేక్ మస్తాన్‌వలి, బసవ చారిటబుల్ ట్రస్ట్ అధినేత వేమూరు శ్రీనివాసరావు, పాఠశాల హెచ్ఎం సుజాత, ఉపాధ్యాయులు, బసవ గ్యాస్ట్రో లివర్ ఇనిస్టిట్యూట్ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా శ్రవణా నక్షత్రం పూజలు

నరసరావుపేట అర్బన్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట పట్టణంలోని మునిసిపల్ కార్యాలయ ప్రాంగణంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో శ్రవణా నక్షత్రం సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలను ఆలయ అర్చకులు చతుర్వేదుల భ్రమర కుమార్ శర్మ నిర్వహించారు.

నేడు డయల్ యువర్ డీఎం

నరసరావుపేట టౌన్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): డయల్ యువర్ ఏపీఎస్ఆర్‌టీసీ డీఎం కార్యక్రమం సోమవారం నిర్వహిస్తున్నామని డీఎం శ్రీనివాసరావు ఆదివారం తెలిపారు. ఉదయం 11గంటల నుంచి 12గంటల వరకు 9959225424కు సమస్యలను తెలియజేయాలన్నారు.

సమ్మెకు ప్రజా సంఘాల మద్దతు

నరసరావుపేట టౌన్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు చేపట్టిన సమ్మెకు ప్రజా సంఘాల నాయకులు ఆదివారం మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ షరతులు లేకుండా మున్సిపల్ కార్మికులందరికీ సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో కుల నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి కే.కృష్ణ, టి.కోటేశ్వరరావు, టి.శ్రీనివాసరావు, పీడీఎం నల్లపాటి రామారావు, ఎంపిఎం పట్టణ అధ్యక్షుడు షేక్ మౌలాలి, బీసీ సంక్షేమ సంఘం బి.శ్రీనివాసరావు, కే స్వరూప్ తదితరులు పాల్గొన్నారు.


రేపు కంటి వైద్యశిబిరం

వినుకొండ టౌన్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 15వ తేదీన ప్రభుత్వ ఉద్యోగులు, పింఛనుదారులకు కంటి వైద్యశిబిరం నంద్యాల శాంతిరామ్ సూపర్‌స్పెషాలిటీ హాస్పటల్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు సంఘం అధ్యక్షుడు బి.సుబ్రహ్మణ్యం తెలిపారు.

● చిలకలూరిపేట: శస్త్ర చికిత్స చేయించుకున్న సూదావారిపాలెంకు చెందిన అశ్వధాటి వెంకటేశ్వర్లు అనే లారీ డ్రైవర్‌కు జనసేన పార్టీ నాయకుడు అచ్చుకోల మురళీకృష్ణ ఆదివారం సాయం అందించారు.

చిత్రజ్యోతి
SINCE 1965

విలక్షణ నటనకు వినమ్ర నివాళి



తన విలక్షణ నటనతో తెలుగు సినీరంగంపై చెరగని ముద్రవేసిన దిగ్గజ నటుడు కోట శ్రీనివాసరావు మృతితో చిత్ర పరిశ్రమ దిగ్భ్రాంతికి గురైంది. వృత్తిపరమైన, వ్యక్తిగత అనుబంధం కలిగిన పలువురు సినీ ప్రముఖులు ఆయన మృతిపట్ల ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. నటులు రాజేంద్రప్రసాద్, మురళీ మోహన్, ప్రకాశ్‌రాజ్, తనికెళ్ల భరణి, నిర్మాత సురేశ్‌బాబు, దర్శకుడు త్రివిక్రమ్ తదితరులు కోట శ్రీనివాసరావు భౌతిక కాయానికి నివాళులర్పించారు.

కోట శ్రీనివాసరావుగారు తెలుగు ప్రేక్షకుల గుండెల్లో తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు. తన విలక్షణ నటనతో ఎన్నో పాత్రలకు జీవం పోశారు. ఇతర భాషల్లోనూ నటించి మెప్పించిన ఘనత ఆయనకే దక్కుతుంది. ఎమ్మెల్యేగా గెలుపొంది ప్రజా జీవితంలోనూ మంచి నాయకుడిగా పేరు తెచ్చుకున్నారు. ఆయన మరణం తెలుగు సినీ రంగానికి తీరని లోటు.

- నందమూరి బాలకృష్ణ

నాకెంతో ఇష్టమైన వ్యక్తి కోట శ్రీనివాసరావు గారు. ఆయన ప్రతిభ, ఉనికి, మంచి మనసును ఎప్పటికీ మర్చిపోలేం. మాటల్లో చెప్పలేని దుఃఖం కలుగుతోంది. వారి ఆత్మకు శాంతి చేకూరాలి.

- మోహన్‌బాబు

తన విలక్షణ నటనతో తెలుగు ప్రేక్షకులను అలరించిన గొప్ప నటుడు కోట శ్రీనివాసరావు. తన నటనతో ప్రేక్షక హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతారు.

- మహేశ్‌బాబు

కోట శ్రీనివాసరావు గారి మరణం తెలుగు పరిశ్రమతో పాటు వ్యక్తిగతంగా నాకు తీరని లోటు. ఆయనతో గడిపిన క్షణాలు మరువలేనివి. గొప్ప నటుడు, మంచి మనిషిని కోల్పోయాం.

- నాగార్జున

కోట శ్రీనివాసరావు గారు ఇక లేరనే వార్త కలచివేసింది. పోషించిన ప్రతి పాత్రకు తన ప్రతిభతో ప్రాణం పోశారు. ఆయన స్థానాన్ని భర్తీ చేయగల నటులు లేరు. వారి ఆత్మకు శాంతి చేకూరాలి.

- రాజమౌళి

మద్రాస్‌లో ఉన్నప్పటి నుంచే మా కుటుంబానికి కోట గారితో అనుబంధం ఉంది. మా నాన్నగారికి ఆయనంటే చాలా ఇష్టం. వారితో ఉన్నప్పుడు సమయమే తెలిసేది కాదు. వారి వ్యక్తిత్వం మర్చిపోలేం. వారి కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతి

- అల్లు అరవింద్

ఎనలేని
నటనా
చాతుర్యంతో
ప్రతి పాత్రకూ తనదైన శైలిలో ప్రాణం పోసిన మహానటుడు కోట శ్రీనివాసరావు గారు. నా సినీ ప్రయాణంలో ఆయనతో నటించిన క్షణాలు ఎప్పటికీ చిరస్మరణీయం. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నాను. వారి కుటుంబ సభ్యులు, ఆత్మీయులకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నా

- ఎన్టీఆర్

సినీ పరిశ్రమ కోట శ్రీనివాసరావు గారి లాంటి విలక్షణ నటుణ్ణి కోల్పోయింది. ఆయన మృతి సినీరంగానికి తీరని లోటు. ఆయన చేసిన అద్భుతమైన పాత్రలు మనకు ఎప్పటికీ గుర్తుండిపోతాయి. కోట శ్రీనివాసరావు గారి ఆత్మకు శాంతి చేకూర్చి, ఈ క్లిష్ట సమయంలో వారి కుటుంబానికి ధైర్యాన్ని ఇవ్వాలని ఆ భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నాను.

- రామ్‌చరణ్

నటనకు పరిపూర్ణ రూపం



కోట శ్రీనివాసరావుగారు ఇకలేరనే వార్త వారి కుటుంబానికే కాదు, పరిశ్రమకూ తీరని లోటు. అలాంటి వైవిధ్యమైన పాత్రలు పోషించే నటుడు మళ్లీ వస్తారని నేను అనుకోవడం లేదు. మా ఇద్దరి నట ప్రస్థానం 'ప్రాణం ఖరీదు' సినిమాతో ప్రారంభమైంది. సుదీర్ఘమైన నట ప్రస్థానంలో మా అనుబంధం ఎంతగానో పెనవేసుకుంది. తెరమీద ఆయన నటన అద్భుతం. బయట ఆయన హాస్యచమత్కారం కూడా అంతే అద్భుతం.

- చిరంజీవి

ఆయన మాట నన్ను కదిలించింది



బాబూమోహన్, కోటగారి కాంబినేషన్‌ను మేం విపరీతంగా ఎంజాయ్ చేసేవాళ్లం. నా తొలి చిత్రం 'అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి'తో మొదలై 'అత్తారింటికి దారేది' వరకూ ఆయనతో కలసి నటించా. నా మనసుకు దగ్గరైన వ్యక్తి. నిర్మొహమాటంగా తన అభిప్రాయాలను నాతో పంచుకునేవారు. కోట గారి మృతి చిత్రపరిశ్రమకు తీరని లోటు. పదిమంది బాగుకోరే వ్యక్తి. అత్తారింటికి దారేది చిత్రంలో నటించేటప్పుడు ఆయన్ను ఈ వయసులో నటిస్తూ ఇబ్బంది పడడం ఎందుకు అని అడిగితే 'నా బాధను మరిచిపోవడానికి నటనే నాకు మందు' అన్నారు. అది నన్ను బాగా కదిలించింది.

- ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

వ్యక్తిగతంగా తీరని లోటు



నా తొలి చిత్రం నుంచి కోట శ్రీనివాసరావుతో దగ్గరి అనుబంధం ఉంది. సురేశ్ ప్రొడక్షన్స్ ప్రతి సినిమాలో కోట గారు నటించారు.

ఇద్దరం కలసి 'శత్రువు, గణేశ్, ఇంట్లో ఇల్లాలు వంటింట్లో ప్రియురాలు, ఆడవారి మాటలకు అర్థాలే వేరులే' లాంటి ఎన్నో మంచి చిత్రాలు చేశాం. వారి మృతి నాకు వ్యక్తిగతంగా తీరని లోటు.

- వెంకటేశ్

సొంత అన్నదమ్ముల్లా ఉండేవాళ్లం

రెండు రోజుల కిందటే ఇద్దరం మాట్లాడుకున్నాం, ఇంటికి వచ్చి కలుస్తానని చెప్పా. నేనొచ్చేసరికి ఆయన లేడు. నా కోటన్న వెళ్లిపోయాడు. ఇంటికొచ్చినప్పుడు ఎంతో సంతోషంగా అప్యాయంగా మాట్లాడేవారు. ఆయనకు అన్నదమ్ములున్నా, నన్నే తన సొంత తమ్ముడిగా భావించేవాడు. షూటింగ్‌కు సమయం తక్కువగా ఉన్నప్పుడు అన్నం కలిపి పెట్టేవాడు. ఏ ఊరికి షూటింగ్‌కు వెళ్లినా, పక్కపక్క గదుల్లోనే ఉండేవాళ్లం. ఇలా మా జీవితంలో ఎన్నో మధుర జ్ఞాపకాలు ఉన్నాయి.

- బాబూమోహన్

కోట మహానటుడు

ఒక దశకంలో నేను, కోట శ్రీనివాసరావు, బాబూమోహన్... మేం ముగ్గురం ప్రతి సినిమాలో ఉండేవాళ్లం. ఆయన మహానటుడు. రోజుకి 18, 20 గంటలు పనిచేసేవాళ్లం. 'అరేయ్ ఒరేయ్' అని పిలుచుకునే వాళ్లం. కోట లేడని అంటే నమ్మలేకపోతున్నా. నటన ఉన్నంత వరకు కోట మన హృదయాల్లో జీవించే ఉంటారు.


- బ్రహ్మానందం

కామెడీ త్రయం



కోట శ్రీనివాసరావు, బాబూ మోహన్, బ్రహ్మానందం ముగ్గురూ కలసి అనేక చిత్రాల్లో నటించారు. కామెడీ త్రయంగా వీరు పంచిన వినోదం ఆల్‌టైమ్ సూపర్ హిట్. వీరి ముగ్గురిని కలిపి సినిమా చేసేందుకు నిర్మాతలకు డేట్స్ దొరకడం కష్టమయ్యేది. చాలా సినిమాల్లో కోట శ్రీనివాసరావు విలన్‌గా నటించగా... బాబూ మోహన్, బ్రహ్మానందం హాస్యనటులుగా, సహాయకులుగా రక్తి కట్టించారు. వెండి తెరపై వీరు ముగ్గురు కలసి చేసిన కామెడీ సన్నివేశాలు ఎంతో ప్రాచుర్యం పొందాయి. ఒక రకంగా చెప్పాలంటే వీరిది ఎవర్‌గ్రీన్ కాంబినేషన్. 'అల్లరి మొగుడు', 'గ్యాంగ్ లీడర్', 'అందాల రాక్షసి', 'అల్లరి ప్రియుడు', 'సమరసింహారెడ్డి' వంటివి వీరు నటించిన పలు విజయవంతమైన చిత్రాలు. కాగా, కోట శ్రీనివాసరావుతో తమకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ బాబూ మోహన్ తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. 'కోటన్న లేడంటే నమ్మలేకపోతున్నా..' అంటూ భోరున విలపించారు.

ఇద్దరూ కలసి వందకు పైగా



కోట శ్రీనివాసరావు, బాబూ మోహన్ కలసి వందకు పైగా సినిమాల్లో నటించారు. 'మామగారు' సినిమాలో బాబూ మోహన్‌ను కోట శ్రీనివాసరావు వెనుక నుంచి తన్నే సన్నివేశాలు ప్రేక్షకుల మదిలో చిరకాలం గుర్తుండిపోతాయి. తన చేతుల్లో బాబూ మోహన్ ఎక్కువ దెబ్బలు తినేవాడని అందరూ అనుకుంటారని కానీ, తాను అలా టచ్ చేస్తే వెళ్లిపడిపోయేవాడని కోట ఓ ఇంటర్వ్యూలో చెప్పారు. కోట- బాబూ మోహన్ కాంబినేషన్ తమ చిత్రాల్లో ఉండాలని హీరోలు డిమాండ్ చేసిన సందర్భాలూ ఉన్నాయి.

ఎన్టీఆర్‌ను అనుకరిస్తూ సినిమా.. వివాదం



ఎన్నో సినిమాల్లో విలక్షణ పాత్రలతో ఆకట్టుకున్నారు కోట శ్రీనివాసరావు. అయితే ఓ సినిమాలోని పాత్రతో ఆయనను వివాదాలు చుట్టుముట్టాయి. అది ఆయన కెరీర్ తొలినాళ్లలో చేసిన 'మండలాధీశుడు'. ఎన్టీఆర్ జీవితం ఆధారంగా తీసిన ఈ సినిమా సమయంలో జరిగిన పరిణామాలను ఓ ఇంటర్వ్యూలో వెల్లడించారు కోట శ్రీనివాసరావు. 'నా పిలుపే ప్రభంజనం' అనే సినిమాలో నేను ఎన్టీఆర్ చెప్పిన డైలాగ్ చెప్పాను. అది ప్రేక్షకులకు నచ్చింది. ఈ సినిమా చూసి నాకు 'మండలాధీశుడు'లో అవకాశం ఇచ్చారు దర్శకుడు ప్రభాకర్ రెడ్డి. అది ఎన్టీఆర్‌ను అనుకరిస్తూ చేసే పాత్ర. మొదట నేను చేయననే చెప్పాను. రామారావు అప్పటి ముఖ్యమంత్రి కాబట్టి ఒకవేళ పాత్ర క్లిక్ అయితే మంచి అవకాశాలొస్తాయి అనే ఉద్దేశంతో అంగీకరించాను. ఆ సినిమా చూస్తే ఎక్కడా ఎన్టీఆర్‌ను విమర్శించినట్లు ఉండదు. ఎన్టీఆర్‌కు జీవితంలో ఎదురైన సంఘటనలు, ఇతరులతో ఆయన వ్యవహరించే తీరు మాత్రమే ఇందులో ఉంటుంది. కానీ ఈ సినిమా విడుదలయ్యాక ఓ ఏడాది పాటు కష్టాలు నన్ను వెంటాడాయి. విజయవాడలో ఎన్టీఆర్ అభిమానులు నాపై దాడి చేయడం ఎంతో బాధించింది. ఆ తర్వాత కొన్నాళ్లకు 'బ్రహ్మర్షి విశ్వామిత్ర' సినిమా సమయంలో డబ్బింగ్ కోసం ఎన్టీఆర్ చెన్నై వచ్చారు. అప్పుడు ఆయన్ను కలవొద్దని చాలా మంది హెచ్చరించారు. కానీ నేను వెళ్లి ఆయన్ని పలకరించా. ఆయన నన్ను చూసి 'మీరు గొప్ప నటుడని విన్నా బ్రదర్. మీరెన్నో గొప్ప పాత్రలు చేయాలి' అని ప్రోత్సహించారు. వెంటనే ఆయన కాళ్ళపై పడిపోయా. ఆ తర్వాత బాలకృష్ణతో 'రౌడీ ఇన్స్పెక్టర్' సినిమాలో అవకాశం దక్కింది. నేను నటించడానికి బాలకృష్ణ కూడా అభ్యంతరం వ్యక్తం చేయలేదు. దాంతో 'మండలాధీశుడు'తో ఏర్పడిన వివాదం సమసిపోయింది' అని తెలిపారు.